# ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర కేబినెట్ తీవ్ర ఆందోళన




**హైదరాబాద్ పెన్ పవర్:** ఎల్‌నినో ప్రభావం, రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులపై సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఆందోళనకర పరిస్థితులపై కేంద్రానికి లేఖ రాయాలని మంత్రివర్గం నిర్ణయించింది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, సాగునీరు, విద్యుత్ రంగాల్లో తీసుకోవలసిన చర్యలపై మంత్రిమండలి సుధీర్ఘంగా చర్చించింది. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రజాభవన్‌లో 1-800-123-7157 టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే ఈ హెల్ప్ లైన్ ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులపై పూర్తి వివరాలతో కేంద్ర ప్రభుత్వానికి నివేదించి నష్టాన్ని అంచనా వేయడానికి ప్రత్యేక బృందాన్ని పంపించాలని కోరాలని భావించింది. అలాగే, వర్షాభావ పరిస్థితుల

- మిగతా 5లో...

పెన్ పవర్
తెలంగాణ రౌండప్




దుండిగల్ విలేజ్ పరిధిలోని ప్రభుత్వ సీలింగ్ భూముల్లో, స్ఫూర్తి ఫౌండేషన్ విద్యాసంస్థ సమీపంలో 'రెడీ మిక్స్ కాంక్రీట్' ప్లాంట్ ఏర్పాటుపై, స్థానికుల నుండి తీవ్ర వ్యతిరేకత నెలకొంది.. తమకు అన్ని అనుమతులు ఉన్నాయని యధేచ్ఛగా పనులు చేపడుతుండటంపై, విషయం తెలుసుకున్న దుండిగల్ సర్కిల్-59 సిఎంసి డిప్యూటీ కమిషనర్ పూర్తి అనుమతులు, నిబంధనల పరిశీలన పూర్తయ్యే వరకు పనులు నిలిపివేయాలని సిబ్బందికి ఆదేశించినట్లు సమాచారం.. చిన్నారుల ఆరోగ్యం, ధూళి, శబ్ద కాలుష్యం, భారీ వాహనాల రాకపోకలపై స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.. స్కూల్ పక్కనే పరిశ్రమకు అనుమతులు ఎలా ఇచ్చారంటూ సంబంధిత శాఖలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. దీనికితోడు సంబంధిత ప్రాంతం హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్‌లో "రెసిడెన్షియల్ (ఆర్-1)జోన్‌గా ప్రకటించినట్లు స్పష్టంగా కనిపిస్తుంది.. "ముందు పిల్లల ఆరోగ్యం.. తర్వాతే పరిశ్రమలు" అంటూ ప్లాంట్‌ను మరో ప్రాంతానికి తరలించాలని స్థానికుల డిమాండ్ చేస్తున్నారు..

సిఎంసి బ్యూరో, పెన్ పవర్, జూలై 17:




# 'ఆర్ఎంసి' ప్లాంట్‌కు..! అనుమతులేవి..?



## ప్లాంట్ పనులు నిలిపివేతకు.. దుండిగల్ డిప్యూటీ కమిషనర్ ఆదేశం..!

- దుండిగల్ 'స్ఫూర్తి పౌండేషన్' పక్కనే "రెడీ మిక్స్ కాంక్రీట్" ప్లాంట్ వివాదాస్పదం..!
- నిబంధనలకు విరుద్దంగా 'ఆర్ఎంసి' ప్లాంట్ నిర్మాణం జరుగుతుందని ఆరోపణ..
- విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు వస్తాయని స్తానికుల అభ్యంతరం..
- అటు ప్రభుత్వ సీలింగ్ భూమిగా ఆరోపిస్తున్న స్థానికులు..
- 'వాయు కాలుష్యం-సౌండ్ పొల్యూషన్' చిన్నారుల ప్రాణాలతో చెలగాటం..?
- రెసిడెన్షియల్ (ఆర్-1) జోన్‌లో 'ఆర్ఎంసి' కంపెనీ ఎలా సాధ్యం..?

-4లో



# తెలంగాణ అభివృద్ధికి 'బుల్లెట్' వేగం

- రాష్ట్రంలోనే 512 కిలో మీటర్ల హైస్పీడు రైలు ట్రాక్
- 3 కారిడార్ల ఎలైన్‌మెంట్‌కు క్యాబినెట్ ఆమోదం
- శంషాబాద్‌లో ప్రధాన స్టేషన్, డిపో.. మొత్తం 400 ఎకరాల్లో హబ్‌కు గ్రీన్‌సిగ్నల్
- వికారాబాద్ సమీపంలో 4.6 కి.మీ. సొరంగ మార్గం

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణను దేశంలోని హైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌కు అనుసంధానించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ప్రతిపాదిత హైదరాబాద్-పుణె-ముంబయి, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై- ఈ మూడు హైస్పీడ్ రైలు కారిడార్ల ఎలైన్‌మెంట్, స్టేషన్‌లు, డిపోలకు సంబంధించి సవరించిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రిమండలి శుక్రవారం ఆమోదం తెలిపింది. శంషాబాద్ సమీపంలో ప్రధాన రైలు స్టేషన్, డిపో కోసం 400 ఎకరాల భూమిని కేటాయించాలని నిర్ణయించింది. హైస్పీడ్ రైలు కారిడార్లకు అనుగుణంగా తుది ఎలైన్‌మెంట్‌ను హెచ్ఎండీఏ, ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌లలో చేర్చాలని స్పష్టం చేసింది. భూసేకరణ, యుటిలిటీల మార్పిడి, వివిధ శాఖల అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. మూడు హైస్పీడ్ రైలు కారిడార్ల ఎలైన్‌మెంట్లకు

- మిగతా 5లో...

# మైనర్ బాలికపై లైంగిక దాడి

**హాలియా పెన్ పవర్::** హాలియా మండలంలో ఓ మైనర్ బాలికపై లైంగిక దాడి జరిగినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మండలంలోని కుపాష్‌పల్లి గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికపై గత కొన్ని నెలలుగా ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.

- మిగతా 5లో...

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి




# ఓటు నమోదు చేయకపోతే..! భవిష్యత్తులో ఇబ్బందులు..!

- సామాజిక వేత్త కోల రవీందర్ ముదిరాజ్ వినూత్న అవగాహన ప్రచారం..
- ఎస్ఐఆర్‌పై ఇంటింటికీ వెళ్లి ఓటు నమోదుపై చైతన్యం..
- ఆధార్ లింక్ అవకాశంపై ప్రజలకు సూచనలు..
- బ్యానర్లు, మైకులతో వినూత్న ప్రచారం..
- విద్యార్థుల ద్వారా కుటుంబాలకు అవగాహన.

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జూలై 17:

ఓటుహక్కు నమోదుపై వినూత్నంగా అవగాహనకై ప్రచారం.. సామాజిక పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ర్యాలీ.. ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ చేరవేసే లక్ష్యంతో సామాజిక వేత్త పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో వినూత్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు.. సూరారం కాలనీ బస్ స్టాప్, ఫస్ట్ హోమ్, సెకండ్ హోమ్ జెండా మీదుగా, సూరారం ఎక్స్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ప్రజలను ప్రత్యక్షంగా కలిసి కొత్తగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఓటరు గుర్తింపు కార్డును ఆధార్‌తో అనుసంధానం చేసే అవకాశాలు ఉండవచ్చని, ముందుగానే ఓటు నమోదు చేసుకోవడం ద్వారా ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుందని ప్రజలకు వివరించారు.. కొత్త ఓటరు నమోదు కోసం 'మీ సేవ' కేంద్రాలను వినియోగించుకోవచ్చని, అలాగే ఇంట్లో స్మార్ట్‌ఫోన్ ఉంటే కుటుంబ సభ్యులు లేదా పిల్లల సహాయంతో ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.. ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు స్వయంగా బ్యానర్‌పై సందేశాలు రాసిన బ్యానర్లను ప్రదర్శిస్తూ ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా రికార్డు చేసిన సందేశాలను మైకుల ద్వారా ప్రధాన కూడళ్లలో ప్రచారం చేస్తూ ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు.. ఈ ప్రచార ర్యాలీలో 60 గజాల శ్యామ్, గుట్ట అశోక్, ఆర్. లక్ష్మీనారాయణ, జి. రమేష్, రాజు, ఆంజనేయులు, దేవి రెడ్డి తదితరులతో పాటు పలువురు సీనియర్ సిటిజన్లు, యువకులు పాల్గొన్నారు..

అలాగే పాఠశాల విద్యార్థులకు కూడా ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ, తమ తల్లిదండ్రులు, అన్నదమ్ములు, కుటుంబ సభ్యులకు కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని తెలియజేయాలని సూచించారు.. ఈ వినూత్న ప్రచారాన్ని చూసిన పలువురు స్థానికులు తమ సెల్‌ఫోన్లలో వీడియోలు చిత్రీకరించి సామాజిక మాధ్యమాల ద్వారా ఇతరులకు పంపడం విశేషం.. ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు..









దుండిగల్ విలేజ్ పరిధిలోని ప్రభుత్వ సీలింగ్ భూముల్లో, స్ఫూర్తి ఫౌండేషన్ విద్యాసంస్థ సమీపంలో 'రెడీ మిక్స్ కాంక్రీట్' ప్లాంట్ ఏర్పాటుపై, స్థానికుల నుండి తీవ్ర వ్యతిరేకత నెలకొంది.. తమకు అన్ని అనుమతులు ఉన్నాయని యధేచ్ఛగా పనులు చేపడుతుండటంపై, విషయం తెలుసుకున్న దుండిగల్ సర్కిల్-59 సిఎంసి డిప్యూటీ కమిషనర్ పూర్తి అనుమతులు, నిబంధనల పరిశీలన పూర్తయ్యే వరకు పనులు నిలిపివేయాలని సిబ్బందికి ఆదేశించినట్లు సమాచారం.. చిన్నారుల ఆరోగ్యం, ధూళి, శబ్ద కాలుష్యం, భారీ వాహనాల రాకపోకలపై స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.. స్కూల్ పక్కనే పరిశ్రమకు అనుమతులు ఎలా ఇచ్చారంటూ సంబంధిత శాఖలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. దీనికితోడు సంబంధిత ప్రాంతం హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్‌లో "రెసిడెన్షియల్ (ఆర్-1)జోన్‌గా ప్రకటించినట్లు స్పష్టంగా కనిపిస్తుంది.. "ముందు పిల్లల ఆరోగ్యం.. తర్వాతే పరిశ్రమలు" అంటూ ప్లాంట్‌ను మరో ప్రాంతానికి తరలించాలని స్థానికుల డిమాండ్ చేస్తున్నారు..

**సిఎంసి బ్యూరో, పెన్ పవర్, జూలై 17:**




# 'ఆర్ఎంసి' ప్లాంట్‌కు..! అనుమతులేవి..?

## ప్లాంట్ పనులు నిలిపివేతకు.. దుండిగల్ డిప్యూటీ కమిషనర్ ఆదేశం..!



ఆర్ఎంసి ప్లాంట్ నిర్మాణ పనులు..

- ఓవైపు జనావాసాలు..! మరోవైపు సీలింగ్ భూమిగా ఆరోపణలు..?
- ప్రభుత్వ సీలింగ్ భూమి కోణంలోనూ రెవెన్యూ అధికారులు పరిశీలించాలి..!
- పర్మిషన్ ఎవరిచ్చారని కీలకంగా లేవనెత్తుతున్న అంశంపై చర్చ..?

- దుండిగల్ 'స్ఫూర్తి పౌండేషన్' పక్కనే "రెడీ మిక్స్ కాంక్రీట్" ప్లాంట్ వివాదాస్పదం..!
- నిబంధనలకు విరుద్ధంగా 'ఆర్ఎంసి' ప్లాంట్ నిర్మాణం జరుగుతుందని ఆరోపణ..
- విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు వస్తాయని స్థానికుల అభ్యంతరం..
- అటు ప్రభుత్వ సీలింగ్ భూమిగా ఆరోపిస్తున్న స్థానికులు..
- 'వాయు కాలుష్యం-సౌండ్ పొల్యూషన్' చిన్నారుల ప్రాణాలతో చెలగాటం..?
- రెసిడెన్షియల్ (ఆర్-1) జోన్‌లో 'ఆర్ఎంసి' కంపెనీ ఎలా సాధ్యం..?

ఓ పౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కూల్ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడే విధంగా, 'ఆర్ఎంసి' (రెడీ మిక్స్ కాంక్రీట్) ప్లాంట్ ఏర్పాటు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీస్తుంది.. ప్రతిరోజూ వందలాది మంది చిన్నారులు విద్యను అభ్యసిస్తున్న ఆ ప్రాంతంలో ఇటువంటి పరిశ్రమను ఏర్పాటు చేయాలనే ప్రయత్నం తల్లిదండ్రులు, స్థానిక ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది.. దుండిగల్ సర్కిల్-59 సిఎంసి పరిధి దుండిగల్ గ్రామ పరిధిలోని 'స్ఫూర్తి ఫౌండేషన్ విద్యాసంస్థ'కు ఆనుకుని నూతనంగా నిర్మిస్తున్న 'ఆర్ఎంసి' ప్లాంట్ విద్యార్థుల ప్రాణాలకు సంకటంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, ప్రశాంతమైన విద్యా వాతావరణంపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. ప్రజలు లేవనెత్తుతున్న ప్రశ్నలు.. భారీ మిక్సర్ లారీలు, నిర్మాణ సామగ్రి రవాణా, పరిశ్రమ కార్యకలాపాల వల్ల భవిష్యత్తులో ట్రాఫిక్, శబ్దం, ధూళి వంటి అంశాలు పెరిగే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.. ఒక స్కూల్ పక్కనే పరిశ్రమ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమిటి..? పిల్లల భవిష్యత్తు కంటే వ్యాపారమే ముఖ్యమా..?" అంటూ పలువురు తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.. స్థానికుల వాదన ప్రకారం, విద్యాసంస్థల పరిసర ప్రాంతాలు భద్రత, పరిశుభ్రత మరియు ప్రశాంతతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన ప్రాంతాలు. అలాంటి ప్రదేశాల్లో పరిశ్రమల ఏర్పాటు విషయంలో అత్యంత జాగ్రత్త అవసరమని వారు పేర్కొంటున్నారు..





### సీలింగ్ భూమిపై రెవెన్యూ పరిశీలన అవసరం..!

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, గండిమైసమ్మ దుండిగల్ మండలం గ్రామ రెవెన్యూ పరిధిలోని స్ఫూర్తి పౌండేషన్ పాఠశాల సమీపంలో నిర్మిస్తున్న 'ఆర్ఎంసి' ప్లాంట్ నిర్మాణం వివాదం అధికారుల నిర్లక్ష్యాన్ని సూచిస్తుంది.. దుండిగల్ ప్రభుత్వ సీలింగ్ భూమిలోనే ఉందని స్థానికులు బలమైన ఆరోపణలు ఇందుకు ప్రధాన కారణం.. 321, 322, 323, మరికొన్ని సర్వే నెంబర్‌లలో దాదాపు 100 ఎకరాలు ప్రభుత్వ సీలింగ్ భూమి ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తుండగా, ఔటర్ రింగ్ రోడ్‌కు సుమారు 20 ఎకరాలు పోయినట్లు స్థానికుల వాదన.. ఇప్పటికీ కొంత ప్రైవేటు వ్యక్తుల(మామిడి తోట) ఆధీనంలో ఉందని, ప్రస్తుతం నిర్మిస్తున్న 'ఆర్ఎంసి' ప్లాంట్ నిర్మాణం సీలింగ్ భూమిలోనే ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు.. అయితే దుండిగల్ రెవెన్యూ అధికారులు కూడా ఆ కోణంలో పరిశీలించి ప్రభుత్వ సీలింగ్ భూమిని కాపాడాలని కోరుతు..

ప్రతిపాదిత ఆర్ఎంసి ప్లాంట్ సమీపంలోనే ఈ జనావాసాలు..



స్ఫూర్తి స్కూల్‌కు సమీపంలో ప్లాంట్ ఏర్పాటు చేయడానికి సంబంధిత శాఖలు పూర్తి స్థాయి పరిశీలన చేశాయా..? పిల్లల ఆరోగ్య భద్రతపై నిపుణుల నివేదికలు ఉన్నాయా..? ట్రాఫిక్, కాలుష్య ప్రభావాలపై సమగ్ర అధ్యయనం జరిగిందా..? స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారా..? హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్‌లో ఆర్-1 జోన్‌లో ఉన్న ఈ స్థలంలో ఏ ప్రాతిపదికన "ఆర్ఎంసి" ప్లాంట్ నిర్మాణం జరుగుతోందని స్థానికులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు.. ఏదిఏమైనప్పటికీ "పిల్లల ఆరోగ్యం ముందు.. మిగతావన్నీ తర్వాతే "దుందిగల్ ప్రజలు, తల్లిదండ్రులు ఒకే మాట చెబుతున్నారు. అభివృద్ధి అవసరమే అయినా, అది చిన్నారుల ఆరోగ్యం, భద్రత, విద్యా హక్కులకు భంగం కలిగించే విధంగా ఉండకూడదని వారు స్పష్టం చేస్తున్నారు.. సంబంధిత శాఖలు వెంటనే స్పందించి, అన్ని అనుమతులు, భద్రతా ప్రమాణాలు, పర్యావరణ అంశాలపై సమగ్ర విచారణ నిర్వహించి ప్రజలకు పూర్తి స్పష్టత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు..

# నూతన అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన టీఎన్జీవోల ప్రతినిధులు

**హైదరాబాద్ పెన్ పవర్:** కరీంనగర్ జిల్లాలో నూతనంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విజిషన్) ఎల్. రాజేశ్వరి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన అధికారులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు మరింత సమర్థవంతంగా చేరుతాయని దారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, చట్టబద్ధమైన అంశాల్లో అవసరమైన సహకారం అందిస్తామని ఇరు అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల సంఘం, టీఎన్జీవోల సంఘం, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.







## తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు యువకులు మృతి..

**మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.**

**ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు.**

**హైదరాబాద్ పెన్ పవర్:** పోలీసుల వివరాల ప్రకారం, జూలై 16వ తేదీ రాత్రి సుమారు 11:50 గంటల సమయంలో దిల్‌కుష్‌నగర్ ఐడీపీఎల్‌కు చెందిన సొహైల్ (18), కుత్బుల్లాపూర్‌కు చెందిన సుమిత్ గైక్వాడ్ (19) మోటార్‌సైకిల్ (నంబర్: ూ08 +ఖ 9850)పై మేడ్చల్ నుంచి కొంపల్లి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో కండ్లకోయ ఔటర్ రింగ్ రోడ్ (ా==) అండర్‌బ్రిడ్జి వద్దకు చేరుకోగానే గుర్తు తెలియని వాహనం వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఢీకొట్టిన తీవ్రతకు ఇద్దరూ రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, ప్రమాదానికి కారణమైన గుర్తు తెలియని వాహనం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఘనంగా మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం...

**రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన నటి మీనాక్షి చౌదరి.**

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ వస్త్ర సౌధం మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం దిల్ సుఖ్ నగర్ లోఘనంగా జరిగింది.సినీ నటి హీరోయిన్ మీనాక్షి చౌదరి చేతుల మీదుగా దీప ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాంగళ్య షాపింగ్ మాల్ లో అన్ని రకాల వస్త్రాలు లభ్యమవుతాయని, ఒక్క మాటలో చెప్పాలంటే వన్ స్టాప్ డెస్టినేషన్ అని తెలిపారు.హైదరాబాద్ లో 15 బ్రాంచ్ ప్రారంభించడం సంతోషం గా ఉందని తెలిపారు. బ్రాండెడ్ వస్త్రాలకు మాంగళ్య షాపింగ్ నిలయం గా మారిందన్నారు.అన్ని వర్గాలకు అనుకూలంగా ఉండే సరసమైన ధరలలో అందుబాటులో ఉంటాయని యజమాని నమః శివాయ తెలిపారు. మొత్తంగా కోదాడ లో 32వ షాపింగ్ మాల్ ప్రారంభించడానికి సిద్ధంగా ఉందన్నారు..హీరోయిన్ మీనాక్షి చౌదరి ని చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు.

## గౌతంగూడలో అంగన్వాడీ కేంద్రం మంజూరు కోసం కుటుంబాల సర్వే పరిశీలన

**హైదరాబాద్ పెన్ పవర్:** చోర్ పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గౌతంగూడ గ్రామంలో 56 ఆదివాసీ గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామంలో ఇప్పటివరకు అంగన్వాడీ కేంద్రం లేకపోవడంతో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు ప్రభుత్వ సంక్షేమ సేవలకు దూరమవుతున్నారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు గౌతంగూడ గ్రామంలో అంగన్వాడీ కేంద్రం మంజూరు ప్రక్రియలో భాగంగా ఈరోజు ICDS సూపర్‌వైజర్ (G-I) ఆధ్వర్యంలో కుటుంబాల సర్వే మరియు స్థల పరిశీలన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి వీరబాబు గారు, గ్రామ సర్పంచ్ మార్సకోలా అనసూయ జూగాదిరావు, ఉప సర్పంచ్ ఆత్రం నీలకంఠరావు, గ్రామ పటేల్, గ్రామ ప్రజాప్రతినిధులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.గౌతంగూడ గ్రామానికి అంగన్వాడీ కేంద్రం త్వరితగతిన మంజూరై, గ్రామంలోని చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రావాలని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీరాములు అందెల

**ఆటో భరత్ కు మద్దతుగా పోస్టర్లను విడుదల చేసిన శ్రీరాములు అందెల**

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల వనపర్తి జిల్లాకు చెందిన చంచరి భరత్ కుమార్ ఆటో డ్రైవర్ గా తన జీవనాన్ని కొనసాగిస్తూ తన ఆటో వెనక మతం మారడం అనేది తండ్రిని మార్చుకోవడంతో సమానం....ఈ భూమిపై పుట్టిన ప్రతి ఒక్కరు హిందువులే అని రాయగ ఆ యొక్క ఆటోను అత్తాపూర్ లో అన్యమతస్తుడు అడ్డుకొని పరుష పదజాలంతో దూషించి ఆటో భరత్ పై దాడి చేసిన నేపథ్యంలో ఈరోజు ఆటో భరత్ కు మద్దతుగా మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ బిజెపి ఇన్చార్జ్ అందెల శ్రీరాములు గారు మహేశ్వరం నియోజకవర్గ కాషాయ శ్రేణులతో కలిసి చార్మినార్ లోని శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆటో భరత్ రాసిన వ్యాఖ్యలతో కూడిన వాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీరాములు గారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత హిందువులపై మరియు ఆలయాలపై దాడులు పెరుగుతున్నాయని ఆరోపించారు. హిందూ సమాజం తమ మత విశ్వాసాలను వ్యక్తీకరించే హక్కును కాపాడాలని, ఆటో భరత్‌పై జరిగిన దాడి ఘటనపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిందూ సమాజానికి సంబంధించిన ప్రతి అంశంలో బీజేపీ అండగా ఉంటుందని, భావ ప్రకటన స్వేచ్ఛను ప్రతి ఒక్కరికీ సమానంగా పరిరక్షించాలని పేర్కొన్నారు.

## ప్రేమ వ్యవహారమే కారణం కత్తితో దాడి చేసిన యువకుల అరెస్టు

**హైదరాబాద్ పెన్ పవర్:** పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో సమీర్ అనే వ్యక్తి పై కత్తితో దాడి చేసిన నలుగురు యువకులను అరెస్టు చేసినట్లు డిఎస్పి శ్రీనివాసరావు తెలిపారు శుక్రవారం ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడిస్తూ ఈనెల 14వ తేదీ రాత్రి 9:30 గంటల సమయంలో సమీర్ అనే వ్యక్తిపై నలుగురు వ్యక్తులు కత్తులతో దాడి చేసి పరారయ్యారు ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టడం జరిగింది ఆళ్లగడ్డ పట్టణ శివారులోని జాతీయ రహదారిపై ఉన్న ఏవీ గోడౌన్ దగ్గర దోష హౌస్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను పట్టణ సీఐ నాగరాజారావు ఎస్సై చిన్న వీరయ్య మరియు సిబ్బంది వారందరినీ అదుపులోకి తీసుకున్నారన్నారు పోలీసుల విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించారని అరెస్టు అయిన వారిలో మునగాల పెద్ద ఏల్లాలు కురుబ వెంకట సుధీర్ తలారి నరేంద్ర మరియు దూదేకుల హుస్సేన్ బాబు ఉన్నారని నిందితుల దగ్గర నుండి రెండు మోటార్ బైకులు ఒక కత్తి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు ప్రేమ వ్యవహారమే ఈ దాడికి ప్రాథమిక కారణంగా గుర్తించినట్టు డిఎస్పి శ్రీనివాసరావు పేర్కొన్నారు నిందితులను కోర్టులో హాజరు పరచునున్నట్లు ఆయన వెల్లడించారు.

# తెలంగాణ అభివృద్ధికి 'బుల్లెట్' వేగం

-3 పేజి తరువాయి

గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం తమ నిర్ణయాన్ని నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌ఎస్ఆర్‌సీఎల్)కు పంపించనుంది. తుది ఆమోదం, ఎలైన్‌మెంట్, స్టేషన్ల స్థానాలను అది ఖరారు చేయాల్సి ఉంది.

**కీలకంగా తెలంగాణ..**

కేంద్ర ప్రభుత్వం 2026 బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా ఏడు హై-స్పీడ్ (బుల్లెట్)రైలు కారిడార్ ప్రాజెక్టులను ప్రకటించగా ఇందులో 3 హైదరాబాద్ కేంద్రంగా ఉన్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల పరిధిలో నిర్మాణం కానున్నాయి. తెలంగాణ వాటా కీలకం కానుంది. ఆయా రాష్ట్రాలన్నింటిలో కలిపి మూడు ప్రాజెక్టుల మొత్తం దూరం 2,028 కి.మీ. కాగా ఇందులో తెలంగాణలోనే 512 కి.మీ. మేర హైస్పీడ్ ట్రాక్ రానుంది. హైదరాబాద్-చెన్నై ప్రాజెక్టును ఎన్‌హెచ్‌ఎస్ఆర్‌సీఎల్ తొలుత నార్కట్‌పల్లి, సూర్యాపేట, ఖమ్మం మీదుగా ప్రతిపాదించగా రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు..ఫ్యూచర్‌సిటీ, నాగార్జునసాగర్ వైపు ఎలైన్‌మెంట్‌ను మార్చారు. హైదరాబాద్-బెంగళూరు మార్గం తొలుత మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్ వైపు ఉండగా రాష్ట్ర ప్రభుత్వం కోరడంతో ఫ్యూచర్‌సిటీ, మన్ననూరు, సోమశిల వైపు ఎలైన్‌మెంట్‌ను మార్చారు. హైస్పీడ్ రైలు ప్రాజెక్టుల ఎలైన్‌మెంట్, విశేషాలతో రవాణా, ఆర్అండ్‌బీశాఖ స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్ క్యాబినెట్‌కు శుక్రవారం ఉదయం నివేదిక అందించారు.

**హైస్పీడ్‌లో కీలక సవరణలు**

ప్రయాణికుల రద్దీని పెంచడంతో పాటు రాష్ట్ర భవిష్యత్ అవసరాల్ని దృష్టిలో పెట్టుకుని ఆయా ఎలైన్‌మెంట్లు, స్టేషన్ల ప్రదేశాలు, పేర్లలో తాజాగా మార్పులు జరిగాయి. స్టేషన్ ప్రదేశాన్ని తొలుత నిర్ణయించిన కోకాపేట నియోపోలిస్ వద్ద కాకుండా మరోచోట ఏర్పాటు చేస్తారు. పశ్చిమదిశగా 500 మీటర్ల దూరం జరిపే అవకాశం ఉంది.

సైబరాబాద్ స్టేషన్: తొలుత కోకాపేట అని పేరు పెట్టగా ఇప్పుడు సైబరాబాద్‌గా మార్చారు.

అనంతగిరి స్టేషన్: తొలుత వికారాబాద్‌లో స్టేషన్ ప్రతిపాదించారు. సుమారు 7 కిమీ దూరం జరిపి అనంతగిరి కొండల పర్యాటక ప్రాంతానికి సమీపంలో ఏర్పాటు.

నల్లమల స్టేషన్: తొలుత మన్ననూరు అని సూచించిన ఈ స్టేషన్‌ను నల్లమలగా మారుస్తూ ప్రతిపాదన. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిలో నిర్మించనున్న ప్రతిపాదిత ఎలివేటెడ్ కారిడార్ ప్రారంభ స్థానంలో నల్లమల హైస్పీడ్ రైలు కారిడార్ స్టేషన్ వస్తుంది.

సోమశిల స్టేషన్: రక్షిత అటవీ ప్రాంతాల సమస్య లేకుండా సోమశిల సమీపంలో ఈ స్టేషన్‌ను ఏర్పాటుచేసేలా ఎలైన్‌మెంట్ మార్పు. కృష్ణా నదిపై ప్రతిపాదిత ఐకానిక్ వంతెనకు వీలుగా ఈ స్టేషన్‌ను సోమశిల పట్టణం దగ్గరలో నిర్మాణం. సోమశిల వద్ద కృష్ణా నదిని దాటి కర్నూలు వైపు కారిడార్ ప్రవేశిస్తుంది.

సాంకేతిక విశేషం: వికారాబాద్ సమీపంలో 4.6 కిమీ పొడవైన సొరంగంలో హైస్పీడ్ రైలు ట్రాక్‌ను నిర్మిస్తారు.

హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ కారిడార్: రావిర్యాల ఔటర్ ఎగ్జిట్ నుంచి..కొత్త రేడియల్ రోడ్డు మీదుగా ప్రయాణించి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలో కలుస్తుంది. శంషాబాద్‌లో ప్రధాన రోలింగ్ స్టాక్ డిపో, వర్క్‌షాప్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. వీటికి రాష్ట్ర ప్రభుత్వం 400 ఎకరాల భూమిని కేటాయించింది. సైబరాబాద్ స్టేషన్ సమీపంలో చిన్న రోలింగ్ స్టాక్ డిపో, ఆపరేషన్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళికలున్నాయి.

**శంషాబాద్‌లో బుల్లెట్ హబ్**

హైదరాబాద్‌ను దక్షిణ భారతదేశ హైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌కు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేలా మూడు కారిడార్లకు శంషాబాద్ వద్ద కామన్ హబ్ ప్రతిపాదించారు.

ఈ మూడు మార్గాల ఎలైన్‌మెంట్లు కొంతదూరం రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్)కు సమాంతరంగా వెళ్లేలా ప్రణాళిక రూపొందించారు. శంషాబాద్ దగ్గరలో, కోకాపేటలో నియోపోలిస్ ప్రాంతంలో ఇలా ఉంది. హైదరాబాద్-పుణె-ముంబయి ప్రాజెక్టు డీపీఆర్ ఇప్పటికే రైల్వేబోర్డుకు చేరింది. హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై ప్రాజెక్టులకు డీపీఆర్ రూపకల్పన కొనసాగుతోంది. హైస్పీడ్ కారిడార్ స్టేషన్లను వీలైన చోటల్లా మెట్రో రైలుతో అనుసంధానిస్తారు.

## ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్ర కేబినెట్ తీవ్ర ఆందోళన

-3 పేజి తరువాయి

నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రణాళికల అమలుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని మంత్రిమండలి కేంద్రాన్ని కోరుతూ తీర్మానించింది. ఈరోజు వరకు రాష్ట్రంలోని ఏ ప్రాంతంలో కూడా సాధారణ వర్షపాతం నమోదు కాలేదని, 30 నుంచి 35 శాతానికి మించి వర్షపాతం నమోదు కాలేదని మంత్రిమండలి ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ పరిస్థితుల్లో అవసరమైన చర్యలు తీసుకోవడానికి అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని ఆదేశించింది. రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఆదేశించింది. విద్యుత్ కోతలు లేకుండా నిరంతర విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించింది. తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనివ్వాలని నిర్ణయించింది. ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతాంగానికి మంత్రిమండలి విజ్ఞప్తి చేసింది. వర్షాభావ పరిస్థితులపై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఉమ్మడి జిల్లా ఇంచార్జీ మంత్రితో పాటు ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి నేతృత్వంలో ఈ నెల 20న జిల్లాల్లో ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, నిపుణులు, శాస్త్రవేత్తలు అందరితో సమావేశాలు నిర్వహించి జిల్లాల వారిగా తలెత్తిన పరిస్థితులు, జరిగిన నష్టంపై సమగ్రమైన నివేదికలు తయారు చేయాలని మంత్రిమండలి తీర్మానించింది. రాష్ట్ర ప్రణాళిక మండలి వైస్ చైర్మన్ జి చిన్నారెడ్డి సారథ్యంలో వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలతో వ్యవసాయ రంగంపై ఎల్‌నినో ప్రభావంపై ప్రత్యేక నివేదిక రూపొందించాలని మంత్రివర్గం సూచించింది.

ఇక భూముల రికార్డులు, భూముల క్రయ విక్రయాలకు సంబంధించి ధరణి పోర్టల్ ద్వారా జరిగిన అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణకు ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటు చేయాలని మంత్రిమండలి నిర్ణయించినట్టు తెలిపారు. ధరణి పోర్టల్ కు సంబంధించి టెండర్ ప్రక్రియ నుంచి మొదలు ఇటీవల వచ్చిన ఆరోపణల వరకు అన్ని అంశాలపై విచారణ జరిపించాలని నిర్ణయించినట్టు చెప్పారు. 2020 అక్టోబర్ 29 నుంచి ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన రోజు నుంచి ఈనాటి వరకు భూముల రిజిస్ట్రేషన్లు, రికార్డుల మార్పులు, వ్యవసాయ భూములు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూముల బదలాయింపులు సహా జరిగిన అన్ని అనుమానాస్పద లావాదేవీలను లోతుగా పరిశీలించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లను కో-ఆప్టెడ్ సభ్యులుగా నామినేట్ చేసేందుకు తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం--2019ను సవరించే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గ్రామ పంచాయతీ నిధుల నిర్వహణకు సంబంధించి జాతీయ బ్యాంకులు, సహకార బ్యాంకులు లేదా పోస్టాఫీసుల్లో ఈ నిధులను జమ చేసుకునేలా ప్రతిపాదించిన సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది. అందుకు సంబంధించి తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం--2018లో సవరణకు మంత్రిమండలి ఆమోదం ముద్ర వేసినట్టు తెలిపారు.

## మైనర్ బాలికపై లైంగిక దాడి

-3 పేజి తరువాయి

ఈ ఘటనలో కుపాష్‌పల్లి గ్రామానికి చెందిన ఆదిమల్ల అజయ్, గుడిపల్లి గ్రామానికి చెందిన బండారు అఖిల్‌పై ఆరోపణలు ఉన్నాయి.

కొద్ది రోజుల క్రితం బాలికకు కడుపు నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లగా, వైద్య పరీక్షల సందర్భంగా జరిగిన విషయాన్ని ఆమె వెల్లడించినట్లు సమాచారం. అనంతరం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు బాలికను నల్లగొండలోని భరోసా కేంద్రానికి తరలించి, కేసుకు సంబంధించిన శాస్త్రీయ ఆధారాలను సేకరిస్తున్నట్లు హాలియా ఎస్ఐ బండి సాయి ప్రశాంత్ తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా సాంకేతిక ఆధారాలను కూడా సేకరిస్తున్నామని పేర్కొన్నారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అమరావతిలో ఎకరం 8 కోట్లు

**హైదరాబాద్ పెన్ పవర్:**

అమరావతి రాజధాని భూముల విలువ సరికొత్త రికార్డు సృష్టించింది. స్టార్ హోటళ్ల కోసం ఎకరానికి రూ.8.20 కోట్ల ధరను సీఆర్డీఏ నిర్ణయించింది. అమరావతిలో ఇప్పటి వరకు ప్రభుత్వ భూముల కేటాయింపుల్లో ఇదే అత్యధిక ధర. అదే సమయంలో ప్రైవేట్ స్కూళ్ల కోసం ఎకరానికి రూ.4.10 కోట్ల ధరతో ఐదు స్టార్ హోటళ్లు, ఐదు ప్రైవేట్ పాఠశాలల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించింది. అమరావతిలో రాజధాని నిర్మాణం వేగం పుంజుకుంటున్న వేళ సీఆర్డీఏ తీసుకున్న ఈ కీలక నిర్ణయం.. అమరావతి నగరానికి మరో మైలురాయిగా నిలిచిపోనుంది. అయితే, అమరావతిలో ఇప్పటివరకూ కేటాయించిన భూముల్లో ఇదే అత్యధిక రేటు.. స్టార్ హోటళ్లకు 9.19 ఎకరాలు.. ప్రైవేట్ స్కూళ్లకు 15.80 ఎకరాల భూమిని జ=ణూ కేటాయించింది. స్కూల్ నిర్మాణం కోసం 33ఏళ్ల పాటు భూమిని లీజుకు తీసుకోవచ్చు. ఇక.. హోటల్ నిర్మాణానికి కేటాయించిన భూమి.. ఎకరానికి రూ.8.20 కోట్ల ధర నిర్ణయించింది జ=ణూ..రాజధానిలో మూడు త్రీ స్టార్, రెండు ఫోర్ స్టార్ హోటళ్లు ఏర్పాటు చేయనున్నారు. హోటల్ భూములను ఫ్రీహోల్డ్ పద్ధతిలో కేటాయిస్తారు. హోటల్ ఏర్పాటు చేయాలంటే కనీసం రూ.75 కోట్ల పెట్టుబడి తప్పనిసరి. ప్రతి హోటల్‌లో కనీసం 125 గదులు ఉండాలి. ప్రతి గది 5 స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. ప్రతి హోటల్ భవనంపై హెలిప్యాడ్ ఏర్పాటు చేయడం తప్పనిసరి. హోటల్ నిర్వహణకు కనీసం 175 మంది సిబ్బంది ఉండాలి. కన్వెన్షన్, బ్యాంకెట్ హాళ్లు ఏర్పాటు చేసి ఏడాదికి కనీసం 2,500 మందికి ఉపాధి కల్పించేలా ప్రణాళిక ఉండాలని సీఆర్డీఏ షరతు విధించింది.హోటళ్లను నిర్మించే సంస్థలు సీఆర్డీఏకు ప్రత్యేక సౌకర్యాలు కూడా కల్పించాలి. ప్రతి ఏడాది 15 రోజుల పాటు గదులను సీఆర్డీఏ వినియోగానికి ఉచితంగా అందుబాటులో ఉంచాలి. ప్రభుత్వ సమావేశాలు, సదస్సుల కోసం బ్యాంకెట్ హాలును కూడా ఏడాదికి 15 రోజుల పాటు ఉచితంగా ఇవ్వాలి. ఏడాది లోపు బ్యాంకు గ్యారంటీ సమర్పించడంతో పాటు, నిర్ణీత గడువులో నిర్మాణాలు పూర్తి చేయాలి. ఒప్పంద నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు, బ్యాంకు గ్యారంటీ జప్తు వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని టెండర్లలో స్పష్టం చేసింది.రాజధానిలో నాణ్యమైన విద్యా సంస్థలను ప్రోత్సహించేందుకు ఐదు ప్రైవేట్ స్కూళ్ల ఏర్పాటుకు 15.80 ఎకరాల భూమిని కేటాయించింది. ఎల్‌కేజీ నుంచి ప్లస్-2 వరకు విద్య అందించే పాఠశాలలు ఏర్పాటు చేయాలని టెండర్లలో పేర్కొంది. స్కూళ్లకు ఎకరానికి రూ.4.10 కోట్ల ధర నిర్ణయించి, 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన భూములు కేటాయించనుంది. తుళ్లూరు, నవులూరు, పెనుమాక, కృష్ణాయపాలెం, దొండపాడు ప్రాంతాల్లో ఈ స్కూళ్లు ఏర్పాటు కానున్నాయి.

# వివాదంలో ఆర్ ఎస్ ప్రవీణ్...




**అదిలాబాద్, జూలై 17, పెన్ పవర్:** కొద్దిరోజులుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద.. తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు భారత రాష్ట్ర సమితి సీనియర్ నాయకుడు.. మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. ముఖ్యంగా గురుకులాల విషయంలో ప్రవీణ్ తీవ్రస్థాయిలో స్పందిస్తున్నారు. వేలకోట్ల కుంభకోణం జరిగిందని.. ఇదంతా రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్ర అని ప్రవీణ్ కుమార్ మండిపడుతున్నారు. రోజుల వ్యవధిలోనే అనేకసార్లు విలేకరుల సమావేశం నిర్వహించి.. ముఖ్యమంత్రిని తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేస్తున్న విమర్శలకు కాంగ్రెస్ పార్టీ నుంచి కాకుండా భారతీయ జనతా పార్టీ నుంచి కౌంటర్ వచ్చేసింది. భారతీయ జనతా పార్టీ నాయకుడు గువ్వల బాలరాజు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీద తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకులాల కార్యదర్శిగా ఉన్నప్పుడు.. గురుకులాల నిర్వహణ.. నిధుల ఖర్చు ఇటువంటి వాటిపై గువ్వల బాలరాజు కీలకమైన ఆధారాలు బయటపెట్టారు. 2013 నుంచి 2021 మధ్యకాలంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకుల విద్యాలయాల కార్యదర్శిగా పనిచేసినప్పుడు భారీగా అక్రమాలు జరిగాయని.. దాదాపు పదివేల కోట్ల వరకు ప్రజాధనం పక్కదారి పట్టిందని గువ్వల బాలరాజు ఆరోపించారు. ఈ మేరకు తాను ముఖ్యమంత్రికి ఒక లెటర్ రాశారు. టెండర్ ప్రక్రియలు మొత్తం పక్కన పెట్టి.. నిధులను సంతానికి మళ్ళించుకున్నారని బాలరాజు ఆరోపించారు. దీనిపై సమగ్రమైన విచారణ సాగించాలని ఆయన డిమాండ్ చేశారు.కేవలం ప్రవీణ్ కుమార్ ను మాత్రమే కాకుండా.. నాటి ముఖ్యమంత్రి చంద్రశేఖర రావును కూడా బాలరాజు న్యాయపరంగా లక్ష్యంగా చేసుకున్నారు. నాడు జరిగిన అక్రమాలకు కేసీఆర్ మద్దతు ఉందని.. ఆయన సపోర్టుతోనే ఇవన్నీ జరిగాయని బాలరాజు ఆరోపించారు. ఐపీఎస్ కేడర్ స్థాయి అధికారులు నిర్వహించాల్సిన గురుకుల సెక్రటరీ విధులను ఐపీఎస్ అధికారి ప్రవీణ్ కుమార్ కు ఏకంగా 10 సంవత్సరాల పాటు అప్పగించడం వెనక ఉన్న నిజాలు ఏంటో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమంగా ప్రవీణ్ సంపాదించిన ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.మరోవైపు బాలరాజు ముఖ్యమంత్రికి రాసిన లేఖ.. చేసిన విమర్శలపై ప్రవీణ్ కుమార్ కూడా ఆదే స్థాయిలో స్పందించారు. ఇదంతా అబద్ధమని అన్నారు. కేవలం ఎనిమిది వందల కోట్ల వార్షిక బడ్జెట్ ఉన్న గురుకులాలలో వేల కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని ప్రవీణ్ ప్రశ్నించారు.. బడ్జెట్ పరిమితులను దృష్టిలో పెట్టుకొని ఆరోపణలు చేయాలని బాలరాజుకు చూపించారు. బాలరాజు చేసిన ఆరోపణల వెనుక రాజకీయ కుట్ర కోణం ఉందని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి.. బండి సంజయ్.. బాలరాజు తను లక్ష్యంగా చేస్తున్నారని.. ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. ఇటువంటి వాటికి తాను భయపడనని ఆయన స్పష్టం చేశారు

# పురుషులను గౌరవించడం మన సంప్రదాయం'..

# ఫ్రీ బస్ వేళ ఆర్టీసీ బస్సులో ఇంట్రెస్టింగ్ బోర్డు

**నల్గొండ, జూలై 17, పెన్ పవర్:** ఆర్టీసీ బస్సులో 'పురుషలను గౌరవించడం మన సంప్రదాయం' అని రాసి ఉన్నట్లు కనిపించే ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ ఫొటో సూర్యాపేట రూట్ బస్సులో తీసిందిగా ప్రచారం జరుగుతుండగా.. దీనిపై నెటిజన్లు సరదాగా వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే ఈ బోర్డు నిజమైనదా లేదా ఏఐ, డిజిటల్ ఎడిటింగ్‌తో రూపొందించారా అనే విషయంపై స్పష్టత లేదు. తెలంగాణ ఆర్టీసీ కూడా ఇప్పటివరకు దీనిపై అధికారికంగా స్పందించలేదు.తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సులు, ప్రయాణాలకు సంబంధించిన పోస్టులు, మహిళల కొట్లాటలు సోషల్ మీడియాలో తరచూ వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా ఓ ఆర్టీసీ బస్సులో కనిపించిన బోర్డు నెట్టింట పెద్ద చర్చకు దారితీసింది. సాధారణంగా బస్సుల్లో కనిపించే 'స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం' అనే సందేశానికి బదులుగా ' పురుషలను గౌరవించడం మన సంప్రదాయం ' అని రాసి ఉన్నట్లు కనిపించే ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.ఈ ఫొటో సూర్యాపేట రూట్‌లో నడిచే ఆర్టీసీ బస్సులో తీసింది అని పలువురు నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా చెబుతున్నారు. దీంతో నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. "ఇన్నాళ్లకు మాకు కూడా గౌరవం దక్కింది", "ఇకపై బస్సులో సీటు దొరికే అవకాశముంది" అంటూ కొందరు పురుషులు సరదాగా ఫన్నీ కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు ఈ బోర్డు నిజంగా ఆర్టీసీ ఏర్పాటు చేసిందా లేక ఎవరైనా సరదాగా మార్చారా అంటూ సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.అయితే ఈ ఫొటో నిజమైందా కాదా అనేది మాత్రం స్పష్టత లేదు. కొందరు నెటిజన్ల అభిప్రాయం ప్రకారం.. అసలు బోర్డుపై ఉన్న స్త్రీలను అనే పదాన్ని డిజిటల్ ఎడిటింగ్ లేదా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో 'పురుషలను'గా మార్చి సోషల్ మీడియాలో వైరల్ చేశారని పేర్కొంటున్నారు. ఇప్పటివరకు ఈ బోర్డు నిజమైందా లేక ఎడిట్ చేసిందా అనే దానిపై తెలంగాణ ఆర్టీసీ అధికారుల నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లో ఉన్న నేపథ్యంలో బస్సుల్లో సీట్ల కొరత, ప్రయాణ అనుభవాలపై ఇప్పటికే సోషల్ మీడియాలో అనేక మీమ్స్, ట్రోల్స్, పోస్టులు వైరల్ అవుతున్నాయి. ఇప్పుడు ఈ బోర్డు కూడా వైరల్ కావడంతో.. మరోసారి చర్చనీయాంశంగా మారింది. అయితే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ప్రతి ఫొటోను నిజమని నమ్మే ముందు అధికారిక సమాచారం కోసం వేచి చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

# డీ లిమిటేషన్ బిల్లుకు కాంగ్రెస్ సపోర్టా....

# రేవంత్ వాదనేంటి



**హైదరాబాద్, జూలై 17, పెన్ పవర్:** తెలంగాణా ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి మరో రెండు టెర్మ్‌లు తనదే అధికారం అని ప్రతీ సభలో చెబుతూ ఉంటారు. రాసి పెట్టుకోండి అని ఆయన అంటున్నారు. ఇక తాజాగా ఆయన ఖమ్మం సభలో అయితే మీడియాకు నంబర్ చెప్పి మరీ మాకు 2029 లో వచ్చే సీట్లు ఇవ్వే లెక్క కరెక్ట్ అని పక్కాగా చెప్పారు. మాకు 117 సీట్లు వస్తాయని ఆయన అన్నారు. తెలంగాణాలో సీట్లు 182 దాకా పెరుగుతాయని అందులో 117 ఒక్క కాంగ్రెస్ కే సొంతంగా వస్తాయని ఆయన స్పష్టం చేశారు. : ఇదిలా ఉంటే రేవంత్ రెడ్డిని ఎవరు తక్కువగా అంచనా వేసినా పప్పులో కాలేసినట్లే అని అంటున్నారు. అలాగే 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేతలు లైట్ తీసుకున్నారు. దానికి గానూ ఏకంగా భారీ మూల్యం చెల్లించి గద్దె దిగాల్సి వచ్చింది. మరి ఇపుడు చూస్తే రేవంత్ రెడ్డి అధికారంలో ఉన్నారు. ప్రభుత్వం నడుపుతున్నారు. పైగా కాంగ్రెస్ అధినాయకత్వం వద్ద ఆయనకు మంచి పేరు ఉంది. రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ ఆయనకే ఓటు వేస్తున్నారు. దాంతో మరో రెండు సార్లు కాంగ్రెస్ ని అధికారంలోకి తీసుకుని వస్తామని రేవంత్ తన వద్ద ఉన్న అంచనాలతోనే చెబుతున్నారు: తెలంగాణాలో ప్రస్తుతం 119 సీట్లు ఉన్నాయి. అవి ఏకంగా 182 దాకా అవుతాయని రేవంత్ రెడ్డి లెక్క కడుతున్నారు. ఇలా సీట్లు మరో డెబ్బై దాకా పెరిగితే అది కాంగ్రెస్ ప్రభుత్వానికే అనుకూలిస్తుంది అని ఆయన భావిస్తున్నారు. ఎపుడూ అధికారంలో ఉండే పార్టీకే ఈ సీట్ల పెరుగుదల అడ్వాంటేజ్ గా ఉంటుంది అని అంటున్నారు. 2009 లో అసెంబ్లీ సీట్ల పునర్ విభజన వైఎస్సార్ కి బాగా కలిసి వచ్చింది. ఇపుడు కూడా రేవంత్ రెడ్డి అదే జరుగుతుందని భావిస్తున్నారు అంటున్నారు.ఇక రాజకీయంగా చూస్తే వ్యతిరేక ఓట్లు భారీగా వచ్చే ఎన్నికల్లో చీలిపోతాయని కూడా రేవంత్ రెడ్డి అంచనా కడుతున్నారు. విపక్షంలో బీజేపీ బీఆర్ఎస్ రెండూ పోటా పోటీగా ఉన్నాయి. ఈ రెండూ కలిసేది లేదు అని అంటున్నారు. కలుస్తాయని అందుకే పెద్ద ఎత్తున రేవంత్ రెడ్డి ప్రచారం చేస్తున్నారు. ఇదంతా వ్యూహాత్మకం అని అంటు న్నారు. ఈ రెండు పార్టీ కలిసినా అప్పటికి అది బూమరాంగ్ అవుతుందని విడిగా పోటీ చేస్తే కనుక కచ్చితంగా యాంటీ ఇంకెంబెన్సీని పంచుకుంటాయని దాంతో మరోసారి గెలుపు బాట కాంగ్రెస్ దే అని రేవంత్ రెడ్డి పూర్తి ధీమాతో ఉన్నారు అని అంటున్నారు.

## సాఫ్ట్ వేర్ నుంచి సాగువైపు...

**నిజామాబాద్, జూలై 17, పెన్ పవర్:** నేటి తరం యువత చదువు పూర్తి కాగానే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించాలనో.. లక్షలు ఖర్చు చేసి ఉన్నత చదువుల కోసం అమెరికా, లండన్ వంటి విదేశాలకు వెళ్లాలనో కలలు కంటుంది. కానీ.. తెలంగాణకు చెందిన ఒక సాధారణ రైతు బిడ్డ మాత్రం ఆ గ్లామరస్ ఐటీ ప్రపంచాన్ని, విదేశీ అవకాశాలను కాలదన్ని తాను పుట్టిన మట్టిలోనే వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించింది. నిజామాబాద్ జిల్లా చింతలూరు గ్రామానికి చెందిన సంజనా రెడ్డి సరికొత్త అగ్రి ఎంట్రపెన్యూర్‌గా మారి నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంటోంది. ఆమె సక్సెస్ జర్నీ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారడమే కాకుండా.. లక్షలాది మంది నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది.సంజనా రెడ్డి ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత మంచి ఐటీ కంపెనీలో ఉద్యోగం సంపాదించింది. కానీ ఆ ఉద్యోగంలో చేరలేదు. ఆ తర్వాత విదేశాలకు వెళ్లాలనే లక్ష్యంతో ×జుూు, +=జు పరీక్షలు రాసి, మంచి స్కోర్‌తో అమెరికాలోని ప్రతిష్టాత్మక యూనివర్సిటీ ఆఫ్ సెంట్రల్ మిస్సోరీలో అడ్మిషన్ కూడా సాధించింది. అంతా సిద్ధమై అమెరికాకు పయనమయ్యే సమయంలో ఆమె తనను తాను ఓ ప్రశ్న వేసుకుంది. 'ఉన్నత చదువుల కోసం నా సొంత ఊరిని, దేశాన్ని విడిచి విదేశాలకు ఎందుకు వెళ్లాలి ? నేను చదువుకున్న చదువును, టెక్నాలజీని ఇక్కడే నా కళ్ల ముందే ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఎందుకు ఉపయోగించకూడదు ?' అని ఆలోచించింది.

తాను ఒక రైతు బిడ్డ కావడంతో చిన్నతనం నుండి రైతులు పడే కష్టాలను, నష్టాలను సంజన కళ్లారా చూసింది. నెలల తరబడి ఎండనక, వాననక కష్టపడి పంట పండిస్తున్నప్పటికీ దళారీల వల్ల, మార్కెట్ ఒడిదుడుకుల వల్ల రైతులకు కనీస మద్దతు ధర కూడా లభించడం లేదని గ్రహించింది. ఈ సమస్యకు టెక్నాలజీ, వ్యాపార ఆలోచనలతో చెక్ పెట్టాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే తను రోజూ పొలంలో చేసే పనులను, వ్యవసాయ జీవన విధానాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ప్రారంభించింది. అలా ఆమె పోస్ట్ చేసిన పసుపు సాగు గురించిన ఒక వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. ఆ వీడియో తెచ్చిన క్రేజ్‌తో ప్రజలు నేరుగా తమ పొలం నుంచే స్వచ్ఛమైన పసుపును కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపించారు.ఈ ఊహించని అవకాశాన్ని వ్యాపారంగా మార్చుకుంటూ ఆమె 'ఇందూరు ఫార్మ్స్' అనే ఈ-కామర్స్ స్టార్టప్‌ను ప్రారంభించింది. రైతుల నుంచి పంటను నేరుగా ఎటువంటి దళారీల ప్రమేయం లేకుండా మంచి ధరకు కొనుగోలు చేసి డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా నేరుగా వినియోగదారులకు డెలివరీ చేయడం ప్రారంభించింది. నేడు ఈమె వ్యాపారం కేవలం తెలంగాణకే పరిమితం కాకుండా.. ఆంధ్రప్రదేశ్, బెంగళూరు, చెన్నై వంటి దేశంలోని ప్రధాన మెట్రో నగరాలకు విస్తరించింది.సంజన విజయగాథపై సోషల్ మీడియాలో నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఆమె ఎక్కడ పుట్టిందో.. ఆ మూలాల నుంచే ఎదగాలని నిర్ణయించుకోవడం అత్యంత స్ఫూర్తిదాయకమని అంటున్నారు. నిజమైన మార్పు ఎప్పుడూ మూలాల నుంచే మొదలవుతుందని.. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి ఇంత పెద్ద వ్యాపారాన్ని నిర్మించడం అద్భుతమని, తాను జీవితాంతం చూసిన సమస్యకు టెక్నాలజీతో పరిష్కారం కనుగొన్న సంజన నిజమైన ఎంట్రప్రెన్యూర్ అని నెటిజన్లు కొనియాడుతున్నారు. రైతు కూతురిగా మొదలైన ఆమె ప్రయాణం.. నేడు వందలాది మంది రైతులకు దిక్సూచిగా మారిందని ప్రశంసిస్తున్నారు. నిజంగా సంజనా ప్రయాణం నేటి తరం యువతకు స్ఫూర్తిదాయకం.

## ఆలయంలో హుండీలు చోరీ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఓల్డ్ బోయిన్ పల్లి లో అత్యంత ప్రసిద్ధిగాంచిన శ్రీ దేవి నల్ల పోచమ్మ దేవాలయంలో 2 హుండీలు చోరీకి గురయ్యాయి. స్వామివారి ఆలయంలోని హుండీని గుర్తు తెలియని వ్యక్తి వేకువ జామున తీసుకువెళ్లాడు. హుండీలోని డబ్బు తీసుకొని మరల అక్కడే పెట్టేసాడు. దేవాలయంలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో, ఆలయం చుట్టుపక్కల సీసీ కెమెరాలలో నమోదైన దృశ్యాల ఆధారంగా బోయిన్ పల్లి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. సుమారుగా 20 వేల రూపాయలు అపహరణకు గురయ్యాయని, ఆలయ కమిటీ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు మహిపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... దేవుడు అంటే భక్తి ఉండాలి కానీ, ఇలా ఆలయాలలో హుండీలను చోరీ చేయడానికి వారు తీవ్రంగా ఖండించారు. ఆలయాలు ఇలాంటి చోరీలకు పాల్పడిన దుండగులను కఠినమైన శిక్ష పడే విధంగా పోలీసులు చొరవ చూపాలని కోరారు.

## జులై 25-26వ తేదీలలో విశ్వ మాంగల్య సభ

**హైదరాబాద్ పెన్ పవర్:** అటు ఉద్యోగం ఇటు మాతృత్వం కలగలిపిన జీవితంలో రాణిస్తున్న మహిళలు వారి అభిప్రాయాలు పంచుకునే దిశగా యుగానుకుల మాతృత్వం పేరుతో జులై 25 26వ తేదీలలో హైదరాబాద్, బంజారాహిల్స్,కొమరం భీమ్ ఆదివాసి భవన్ వేదికగా విశ్వ మాంగల్య సభను నిర్వహించనున్నామని సభ జాతీయ సంస్థ సభ్యురాలు వృషాలి జోషి తెలియజేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె భగవతి జి బల్వా,పూజ నరిలి, శృతిలతో కలిసి కార్యక్రమ వివరాలను తెలియజేశారు. విశ్వ మాంగల్య సభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ఎస్ఎస్ అధినేత డాక్టర్ మోహన్ భగవత్ హాజరుకానున్నారని తెలిపారు. మహిళల మధ్య సామాజిక, సాంస్కృతిక,వైచారికా రంగాల్లో వారధిగా పనిచేసే తమ విశ్వమాంగల్య సభ భారతదేశ మహిళల్లో ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఆత్మవిశ్వాసం నింపే మహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు.

## ఆకట్టుకున్న నగల ప్రదర్శన

**హైదరాబాద్ పెన్ పవర్:** వారాహి జ్యువెల్స్ మూడో వార్షికోత్సవం సందర్భంగా జూబ్లీహిల్స్ లోని వారాహి షోరూంలో ప్రత్యేక నగల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను మల్లారెడ్డి విద్యాపీఠం వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రీతిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సంప్రదాయ కళాత్మకతతో రూపొందించిన డైమండ్, కుందన్, పోల్కి, నక్షి, టెంపుల్ జ్యువెలరీతో పాటు డిజైనరీ జ్యువెలరీని ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచుతున్నట్లు నిర్వాహకులు సందీప్ కరణం తెలిపారు. నాలుగు రోజుల పాటు ఈ ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు.

## తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు హాజరు

**హైదరాబాద్ పెన్ పవర్:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లాలో నిర్వహించిన రైల్వే రైల్ రోకో ఉద్యమానికి సంబంధించిన కేసు విచారణలో భాగంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి మాజీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు హాజరయ్యారు. గతంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డిలో చేపట్టిన రైల్ రోకో కార్యక్రమంలో కల్వకుంట్ల కవితతో పాటు తెలంగాణ జాగృతి నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైల్వే ట్రాక్‌పై నిరసన చేపట్టిన సందర్భంగా రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసు విచారణలో భాగంగా ఈరోజు కల్వకుంట్ల కవిత సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు హాజరయ్యారు. కోర్టు ఆవరణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రైల్వే పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. విచారణ అనంతరం కేసును తదుపరి తేదీకి వాయిదా వేసినట్లు తెలిసింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం చేపట్టిన ఉద్యమంలో భాగంగా నమోదైన ఈ కేసు విచారణకు రాజకీయ ప్రాధాన్యత నెలకొనగా, పలువురు తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు కోర్టు వద్దకు చేరుకుని కల్వకుంట్ల కవితకు సంఘీభావం తెలిపారు.

## ముత్తూట్ కార్యాయలంలో బాధితుల అందోళన

**హైదరాబాద్ పెన్ పవర్:**
కేపి.హెచ్.బి పోలీస్ స్టేషన్ పరిధిలో ముత్తూట్ ఫిన్ కార్ప్ గోల్డ్ లోన్ సంస్థలో మేనేజర్ ప్రియాంక చేసిన మోసంలో తో నేడు బాధితులు మరోసారి కార్యాలయంలో ఆందోళన చేపట్టారు. తాము గోల్డ్ లోన్ లో పెట్టిన బంగారాన్ని మేనేజర్ ప్రియాంక తన స్వలాభానికి వాడుకొని డబ్బులు తీసుకుందని వెంటనే తమ బంగారాన్ని తమకు అందజేయాలని డిమాండ్ చేశారు. సుమారు 60 మంది బాధితులు తన వలన ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. ఓవైపు పోలీసులు మరోవైపు బ్రాంచ్ సిబ్బంది ఎటువంటి సమాధానం చెప్పడం లేదని తాము వాపోయారు. అదే విధంగా స్వర్ణ వర్షం అనే స్కీం ద్వారా కూడా మోసాలు జరిగాయని అన్నారు దానిపైన కూడా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## సీబీఎన్ వరుసగా క్లీన్ చిట్స్..

**తిరుపతి, జూలై 17, పెన్ పవర్:**
చంద్రబాబుపై కేసులు పెట్టడమే..బురద పూయడమే లక్ష్యం జగన్ హయాంలో తాడూబొంగరం లేని కేసులను వరుసగా పెట్టుకుంటూ పోయారు. ఇప్పుడా కేసులన్నీ తేలిపోతున్నాయి. ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాం రాజకీయ కక్షసాధింపులకు, వరుస కేసుల పర్వానికి వేదికగా నిలిచింది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం.. అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని రాజకీయంగా, వ్యక్తిగతంగా దెబ్బతీయడమే పరమావధిగా అడుగులు వేసింది. చంద్రబాబు నాయుడు తన సుదీర్ఘ 45 ఏళ్లకు పైబడిన రాజకీయ ప్రస్థానంలో ఎన్నడూ చూడని విధంగా, గత ఐదేళ్ల కాలంలో ఆయనపై అనేక విచిత్రమైన, పసలేని కేసులు మోపారు.ఆంధ్రప్రదేశ్ 2019–2024 మధ్య తీవ్రమైన రాజకీయ కక్షసాధింపులకు, మునుపెన్నడూ లేని రీతిలో ప్రత్యర్థులపై చట్టపరమైన అస్త్రాలను ప్రయోగించిన అపకీర్తికి వేదికగా నిలిచింది. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం.. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని రాజకీయంగా దెబ్బతీయడమే పరమావధిగా అడుగులు వేసింది. అందులో భాగంగానే చట్టబద్ధమైన దర్యాప్తు సంస్థలను, ప్రత్యేకించి సీఐడీని కేవలం ఒక పార్టీ రాజకీయ ఆయుధంగా మార్చుకుని చంద్రబాబుపై అంచెలంచెలుగా కల్పిత ఆరోపణలతో గుట్టలకొద్దీ కేసులు నమోదు చేసింది. అధికారాన్ని హద్దులు దాటి వినియోగిస్తూ, ప్రత్యర్థిని జైల్లో పెట్టడమే లక్ష్యంగా సాగిన ఈ కేసుల పర్వం చివరకు న్యాయస్థానాల ముందు ఒక్కొక్కటిగా ఎలా పేకమేడల్లా కూలిపోతున్నాయో ప్రస్తుత పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.చంద్రబాబు నాయుడు 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా దాఖలు చేసిన అధికారిక ఎన్నికల అఫిడవిట్‌ను పరిశీలిస్తే.. ఆ సమయానికి ఆయనపై మొత్తం 19 కేసులు ఉన్నట్లు నమోదు చేశారు. అంతకుముందు 2014 నాటి అఫిడవిట్‌లో కేవలం 3 సాధారణ కేసులు మాత్రమే ఉండగా, జగన్ ఐదేళ్ల పాలన ముగిసేసరికి ఆ సంఖ్య ఏకంగా 19కి చేరిందంటే, ఏ స్థాయిలో రాజకీయ కక్షపూరిత వ్యూహం నడిచిందో అర్థం చేసుకోవచ్చు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు డిజైన్, ఫైబర్ నెట్ ప్రాజెక్ట్, అసైన్డ్ భూముల బదిలీ వ్యవహారంతో పాటు అంగళ్లు, పుంగనూరు హింస కేసుల వరకు ప్రతీ చిన్న అంశాన్ని పెద్దదిగా చూపిస్తూ క్రిమినల్ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఒక జాతీయ స్థాయి నాయకుడిని, మాజీ ముఖ్యమంత్రిని లీగల్‌గా ఇరుకాయించి సమాజంలో వారి పరువు ప్రతిష్టలను మంటగెలిపించేందుకు నాటి ప్రభుత్వం ఎంచుకున్న మార్గం ఇది.కానీ, న్యాయస్థానాల వేదికగా సత్యం ఎల్లప్పుడూ నిలబడుతుందనే నిజం ఇప్పుడు ముమ్మాటికీ రుజువవుతోంది. సీఐడీ దాఖలు చేసిన చార్జిషీట్లపై సుదీర్ఘ విచారణ జరిపిన కోర్టులు జగన్ హయాంలో నమోదైన కేసులను ఒక్కొక్కటిగా కొట్టివేస్తూ వస్తున్నాయి. అమరావతి అసైన్డ్ భూముల బదిలీ సీఐడీ కేసును న్యాయస్థానం పూర్తిగా కొట్టివేస్తూ సంచలన తీర్పునిచ్చింది. ఆ పిటిషన్‌లో ఎటువంటి బలమైన సాక్ష్యాధారాలు లేవని, కేవలం రాజకీయ దురుద్దేశంతో, కక్షసాధింపు కోణంలోనే కేసు నమోదు చేశారని కోర్టు స్పష్టంగా నిర్ధారించింది. కేవలం ఈ ఒక్క కేసే కాకుండా, రాజధాని ల్యాండ్ పూలింగ్ కోసం సదుద్దేశంతో తీసుకున్న ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలపై నేరపూరిత ఉద్దేశాలను ఆపాదించడం చెల్లదని న్యాయస్థానం స్పష్టం చేయడం.. గత పాలకుల కుట్రలను బట్టబయలు చేసింది.ప్రస్తుతం చంద్రబాబుపై ఉన్న మిగిలిన కేసుల్లో కూడా మెజారిటీ కేసులు తుది విచారణ దశల్లో నిలవలేక తేలిపోతున్నాయి. కొన్ని కేసులపై కోర్టులు స్టే ఇవ్వగా, మరికొన్ని చార్జ్‌షీట్ స్థాయిలోనే ఆధారాలు లేక న్యాయ గండం గట్టెక్కుతున్నాయి. చట్టాన్ని గౌరవించి, న్యాయవ్యవస్థపై నమ్మకంతో సుదీర్ఘ న్యాయపోరాటం చేసిన చంద్రబాబుకు న్యాయస్థానాలు వరుసగా ఇస్తున్న క్లీన్ చిట్స్ . జగన్ రెడ్డి ఐదేళ్ల పాటు ఆడిన మైండ్ గేమ్ కేవలం రాజకీయ కక్షసాధింపేనని నిరూపిస్తోంది. ఒక నాయకుడిని రాజకీయంగా ఎదుర్కోలేక, వ్యవస్థలను తప్పుడు మార్గంలో నడిపించి కేసులు పెడితే.. ఆఖరికి న్యాయదేవత ముందర ఆ అబద్ధాల పునాదులు ఎలా కూలిపోతాయో చెప్పడానికి ఏపీలో జరుగుతున్న ఈ తాజా కోర్టు తీర్పులే ప్రత్యక్ష ఉదాహరణ.

## ఇద్దరు పిల్లలను బావిలో తోసి, తానూ దూకి ఆత్మహత్య చేసుకున్న తల్లి

**హైదరాబాద్ పెన్ పవర్:**
భర్తతో గొడవ పడి ఒక భార్య తన ఇద్దరు పిల్లాలను బావిలో తోసి, తానూ దూకి ఆత్మహత్య చేసుకుంది. కొడంగల్ నుంచి వచ్చి వసంత (35), సుధాకర్ దంపతులు శంకర్పల్లి పరిధిలోని కొత్తపల్లిలో స్థిరపడ్డారు. గురువారం రాత్రి భార్యాభర్తల మధ్య జరిగిన గొడవ నేపథ్యంలో ఇద్దరు పిల్లలను(కూతురు (15), కొడుకు (10))బావిలో తోసి, అనంతరం తాను కూడా దూకి ఆత్మహత్య చేసుకుంది. అదృష్టవశాత్తూ , బాలుడు చెట్టు కొమ్మకు చిక్కుకుని ప్రాణాలతో బయటపడ్డాడు.

## ఆగస్టు 15 నుంచి కొత్త పెన్షన్లు: మంత్రి సీతక్క



**ములుగు: పెన్ పవర్:** తెలంగాణలో ఆగస్టు 15 నుంచి ఒంటరి మహిళలకు కొత్త పెన్షన్లు అందించనున్నట్లు ములుగు జిల్లా పర్యటనలో మంత్రి సీతక్క ప్రకటించారు. అర్హుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పెన్షన్ పొందుతున్న లబ్ధిదారులు మరణిస్తే వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు.

## అమ్మాయిల లోదుస్తులు రాత్రులు మాయం..
## డిటెక్టివ్ గా మారిన గాళ్స్...

**బెంగళూరు, జూలై 17, పెన్ పవర్:**
దేశ ఐటీ రాజధాని బెంగళూరులో విచిత్ర దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. బయట ఆరబెట్టిన మహిళల లోదుస్తులను దొంగతనం చేసిన వ్యక్తి సీసీటీవీకి చిక్కాడు. టెర్రస్‌పై ఉతికి ఆరబెట్టిన లోదుస్తులు రాత్రిపూట మాయం కావడం.. మర్నాడు ఉదయం మళ్లీ ప్రత్యక్షం కావడంతో ఇద్దరు మహిళలు రహస్యంగా సీసీటీవీ కెమెరాను అమర్చడంతో దొంగ దొరికిపోయాడు. దీంతో అసోంకి చెందిన డెలివరీ బాయ్ 23 ఏళ్ల అబ్దుల్ హుస్సేన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బెంగళూరు ఇందిరా నగర్‌లోని హోయసల నగర్‌లో ఈ వింత ఘటన వెలుగులోకి వచ్చింది.దాదాపు రెండు నెలలుగా యువతులు ఉతికి ఆరబెడుతున్న తమ లోదుస్తులు రాత్రిపూట అదృశ్యమవడం.. అంతకంటే విచిత్రమైన విషయం ఏమిటంటే, పోయిన బట్టలు మర్నాడే అదేచోట తిరిగి ప్రత్యక్షమవడం.. వాటి స్థానంలో ఒక కొత్తవి మాయకావడం... ఇలా కొద్ది రోజులుగా జరుగుతోంది. దీంతో టెర్రస్‌పైకి ఎవరు వస్తున్నారో తెలుసుకోవాలని ఆ మహిళలు నిర్ణయించుకుని.. రహస్యంగా సీసీటీవీ కెమెరాను అక్కడ అమర్చారు. జులై 2వ తేదీ తెల్లవారుజామున సుమారు 3 గంటలకు నిందితుడు టెర్రస్‌పైకి ప్రవేశిస్తుండగా అందులో రికార్డ్ అయింది. నిందితుడు ఇంతకుముందు తీసుకున్న అండర్ గార్మెంట్స్ తిరిగి అక్కడ పెట్టి, కొత్త బట్టలు వేసుకుని వెళ్లిపోవడం అందులో కనిపిస్తుంది.అక్కడ నుంచి వెళ్లిపోయే ముందు ఆ బట్టలతో అతడు అసభ్యకరమైన లైంగిక చర్యలకు పాల్పడటం కూడా రికార్డయ్యింది. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు నిందితుడు హుస్సేన్‌ను గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడి మానసిక పరిస్థితి గురించి సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. అతడికి మానసిక విపరీత కోరికలు ఉన్నాయని, మహిళల మాదిరిగానే ప్రవర్తిస్తాడని అన్నారు. గతంలోనూ ఈ తరహా ఘటనలు జరిగాయని, ఇలాంటి మరిన్ని ఉన్నాయేమోనని దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.నిందితుడు ఇంటి బయట ఆరబెడుతున్న మహిళల లోదుస్తులను దొంగిలించి, రాత్రంతా వాటిని ధరించి, మర్నాడు ఉదయం వాటిని తిరిగి తీసుకొచ్చి, కొత్తవాటిని దొంగిలిస్తుంటాడని పేర్కొన్నారు. ఆ ప్రాంతంలోని ఇతర ఇళ్లలో కూడా ఇలాంటి దొంగతనాలకు పాల్పడ్డాడా? అనే కోణంలో దర్యాప్తు సాగుతోందని ఆ అధికారి వెల్లడించారు.

# మైనర్ బాలిక ఆత్మహత్య పోలీసుల అదుపులో ట్యూషన్ టీచర్

**హైదరాబాద్ పెన్ పవర్:**
కూకట్ పల్లి పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జనతా నగర్ లో 14 ఏళ్ల మైనర్ బాలిక ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యగా చేసుకున్న ఘటనలు స్కూల్లో ఉన్న ట్యూషన్ టీచర్ నరేష్ అనే వ్యక్తి కారణమని తండ్రి త్రిలోచన్ సాహూ తెలిపారు. తన కూతురు ఆత్మహత్య చేసుకుంటున్న సమయంలో నరేష్ కు వీడియో కాల్ చేసి మరి ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు. మా అమ్మాయిని ఎంత ఇబ్బంది పెడితే ఈ పని చేసి ఉంటాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు కూకట్

పల్లి పోలీసులు న్యాయం చేసి నిందితుడిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం నరేష్ ను కూకట్ పల్లి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఘటన పైన దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెల్లడించారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పాదయాత్రలకు నేతలు..

**హైదరాబాద్, జూలై 17, పెన్ పవర్:**
మరో ఏడాది తర్వాత తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పాదయాత్రల సందడి మొదలుకానుంది. ఎన్నికలకు ముందు ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రధాన పార్టీలు మరోసారి పాదయాత్రలను ప్రధాన రాజకీయ ఆయుధంగా ఎంచుకుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు రెండేళ్ల ముందు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపడతానని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. మరోవైపు తెలంగాణలో వచ్చే ఏడాది రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర నిర్వహిస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు.దీంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్ష ప్రధాన పార్టీలు ప్రజలతో నేరుగా మమేకమయ్యే వ్యూహాన్ని అమలు చేయనున్నట్లు స్పష్టమవుతోంది. రానున్న ఎన్నికల రాజకీయాల్లో ఈ పాదయాత్రలు కీలక పాత్ర పోషించే అవకాశాలు కనిపిస్తున్నాయి.జగన్‌కు పాదయాత్ర కొత్త కాదు. 2019 ఎన్నికలకు ముందు 2017 నవంబర్‌లో ప్రారంభించిన 'ప్రజా సంకల్ప యాత్ర'ను 2019 జనవరిలో ముగించారు. 341 రోజుల పాటు సాగిన ఈ యాత్రలో ఆయన 3,648 కిలోమీటర్లకు పైగా నడిచి రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను కలుసుకున్నారు. ఆ పాదయాత్ర అనంతరం జరిగిన ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. అయితే 2024 ఎన్నికల్లో పరాజయం పాలైన తర్వాత మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు జగన్ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు.మరోవైపు కేటీఆర్ కు ఇది తొలి పాదయాత్ర కానుంది. ఇప్పటివరకు ఆయన రాష్ట్రవ్యాప్త పాదయాత్ర చేపట్టలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతిపక్ష పాత్రను మరింత బలోపేతం చేయడంతో పాటు బీఆర్ఎస్‌ను క్షేత్రస్థాయిలో పునర్వ్యవస్థీకరించేందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం, పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపడం, రానున్న ఎన్నికలకు సంస్థాగతంగా సిద్ధమవడమే ఈ యాత్ర ప్రధాన లక్ష్యంగా భావిస్తున్నారు. ప్రజల స్పందనను బట్టి ఈ యాత్రలు రానున్న ఎన్నికల రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# డీలిమిటేషన్ బిల్లు గులాబీలో అయోమయం

**హైదరాబాద్, జూలై 17, పెన్ పవర్:**
భారతీయ జనతా పార్టీ మీద తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తూ ఉంటుంది భారత రాష్ట్ర సమితి. ఆ పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు భారతీయ జనతా పార్టీ అధినాయకత్వం మీద ఇష్టానుసారంగా మాట్లాడేవారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీని.. హోం శాఖ మంత్రి అమిత్ షా ను తీవ్రస్థాయిలో విమర్శించేవారు. ఒక దశలో తన సొంత పత్రికలో ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయించేవారు. అయితే ఇప్పుడు సీన్ మారినట్టు కనిపిస్తోంది. భారతీయ జనతా పార్టీ విషయంలో భారత రాష్ట్ర సమితి వైఖరి మారిపోయినట్టు కనిపిస్తోంది.ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిన పార్లమెంటు నియోజకవర్గం ప్రక్రియపై రాజకీయ పార్టీలు వాటి లక్ష్యాలకు అనుగుణంగా స్పందిస్తున్నాయి. అయితే ఈ విషయంలో భారత రాష్ట్ర సమితి ఒకరకంగా ట్విస్ట్ ఇచ్చింది. కెసిఆర్ సూచనల మేరకు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అత్యంత వ్యూహాత్మకంగా ఒక ప్రకటన చేశారు. డీ లిమిటేషన్ బిల్ మీద ఇప్పటివరకు కెసిఆర్ ప్రతికూలమైన స్వరాన్ని వినిపించారు. ఇప్పుడు ఒకసారిగా గొంతు సవరించుకున్నారు. తన కుమారుడు కేటీఆర్ ద్వారా డీలిమిటేషన్ బిల్లుకు పార్టీ తరఫునుంచి జై కొడుతున్నట్టు ప్రకటించారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్య వాటా తగ్గకుండా ఉండాలని.. అప్పుడే సపోర్ట్ చేస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంట్లో 24% వాటా ఉంది. దీనిని వచ్చే రోజుల్లో కూడా అదే విధంగా కొనసాగించాలి. ఇది డిమాండ్ ను కేటీఆర్ మళ్లీ తెరపైకి తీసుకొచ్చారు.జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు ఉంటే దక్షిణాది రాష్ట్రాలకు విపరీతంగా అన్యాయం జరుగుతుందని గతంలో కేసీఆర్ అనేవారు. ఇప్పుడు అదే మాటను కేటీఆర్ కూడా అంటున్నారు. అంతేకాదు దక్షిణాది రాష్ట్రాలు పకడ్బందీగా అభివృద్ధి చెందుతున్నాయని.. అటువంటి రాష్ట్రాల మీద కేంద్రం డి లిమిటేషన్ పేరుతో కత్తి దూయకూడదని కేటీఆర్ చెబుతున్నారు. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు భంగం కలిగితే తాము తీవ్రంగా స్పందిస్తామని కేటీఆర్ హెచ్చరించారు.పార్లమెంట్లో ప్రస్తుతం 543 స్థానాలు ఉన్నాయి. ఈ ప్రకారం సౌత్ స్టేట్స్ మొత్తం కలిపి 24 శాతం బాట కలిగి ఉన్నాయి. వచ్చే రోజుల్లో సీట్ల సంఖ్య యావ శాతం ఫార్ములా ప్రకారం పెరిగిపోతే.. అప్పుడు దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గదు. కేటీఆర్ అంటున్నట్టుగానే 24 శాతం వాటా ఉంటుంది. అలాంటప్పుడు కేటీఆర్ హెచ్చరించడంలో అర్థం ఏముంది. దక్షిణ ప్రాంతానికి చెందిన ప్రజల ప్రయోజనాలను కాపాడే ఫార్ములాను బిల్లులో చేర్చాలని కేటీఆర్ అంటున్నారు. ఈ ప్రకారం చూసుకుంటే డిలిమిటేషన్ బిల్లు కు గులాబీ పార్టీకి ఎటువంటి అభ్యంతరం లేదు . మరి ఇన్ని రోజులపాటు డీ లిమిటేషన్ బిల్లు మీద వ్యతిరేక వార్తలు రాసిన భారత రాష్ట్ర సమితి కరపత్రిక నమస్తే తెలంగాణ పరిస్థితి ఎలా ఉంటుందో ఒకసారి ఊహించుకుంటే. . అత్యంత బాధగా ఉంటుంది. పాపం..

**కేటీఆర్ కు తత్వం తెలిసొచ్చిందా**

రాజకీయాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పరాజయంపై ఆయన మొదటిసారి అత్యంత పారదర్శకంగా.. ఆత్మపరిశీలనాత్మకంగా స్పందించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఎంపీ వద్దిరాజు నివాసంలో మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. ఓటమికి గల కారణాలను ముక్కుసూటిగా అంగీకరించారు. "మా కళ్లు నెత్తికెక్కాయి కాబట్టే మూడోసారి అధికారంలోకి రాలేకపోయాం. ఈ ఓటమిలో 100 శాతం మా తప్పులే ఉన్నాయి. ప్రజల తీర్పును గౌరవిస్తూనే.. మా లోపాలను తప్పకుండా సరిదిద్దుకుంటాం" అని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ 1.8 శాతం ఓట్ల వ్యత్యాసం గత ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ప్రజలు బలంగా నమ్మారని కేటీఆర్ పేర్కొన్నారు. పదేళ్లపాటు బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో ఇతరులకు కూడా ఒక అవకాశం ఇవ్వాలని ఓటర్లు భావించారని ఆయన అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ కేవలం 1.8% ఓట్ల తేడాతో అంటే దాదాపు నాలుగు లక్షల ఓట్ల వ్యత్యాసంతోనే అధికారాన్ని కోల్పోయిందని గుర్తు చేశారు. అయితే 2018 ఎన్నికలతో పోల్చుకుంటే ఈసారి బీఆర్ఎస్ ఓటు బ్యాంకు దాదాపు 10% తగ్గడం వాస్తవమేనని ఆయన అంగీకరించారు.కాంగ్రెస్, బీజేపీలపై విమర్శల బాణాలు రాబోయే రోజుల్లో తెలంగాణలో ప్రధాన పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ఉంటుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రాధికారం కోసం తహతహలాడుతున్న బీజేపీకి ఇక్కడ కనీసం సీఎం అభ్యర్థి లేరని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తరహా ఫలితాలే పునరావృతమవుతాయని.. బీజేపీకి డిపాజిట్లు కూడా దక్కవని జోస్యం చెప్పారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవీకాలం చివరి ఆరు నెలల్లో ఏదో మ్యాజిక్ చేసి మళ్లీ అధికారంలోకి వస్తామని పగటికలలు కంటున్నారు. కానీ, ప్రజలు కాంగ్రెస్ మార్కు మోసపూరిత ప్రయత్నాలను అస్సలు నమ్మరు." అని కేటీఆర్ అన్నారు. మెట్రో విస్తరణ, డీలిమిటేషన్ అంశాలపై స్పష్టత హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలోనే రాయదుర్గం నుండి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మెట్రో పనుల టెండర్లు పూర్తి చేసి, ఎల్ అండ్ టీ సంస్థకు అప్పగించామని తెలిపారు. 24 నెలల్లో పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టు టెండర్లను కాంగ్రెస్ రాగానే రద్దు చేసిందని, ఇప్పుడు 28 నెలల తర్వాత మళ్లీ కొత్తగా ప్రకటిస్తూ డ్రామాలు ఆడుతోందని ఆరోపించారు. పార్టీనే సుప్రీం గతకొద్ది రోజులుగా 'టీఆర్ఎస్' పేరుతో కొత్త పార్టీ రిజిస్ట్రేషన్ అవుతుందనే ప్రచారంపై కేటీఆర్ స్పందించారు. ఎవరైనా ఆ పేరును తిరిగి వాడాలని చూస్తే బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు ఖచ్చితంగా అభ్యంతరం వ్యక్తం చేస్తారని, ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ఫిర్యాదు చేసి ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా "తాను అయినా, మరెవరైనా సరే.. పార్టీ కంటే పెద్దవాళ్లు కాదు. పార్టీనే సుప్రీం" అని కేటీఆర్ కేడర్‌కు స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు. మొత్తానికి కేటీఆర్ చేసిన ఈ ఆత్మపరిశీలన వ్యాఖ్యలు బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త చర్చకు దారితీశాయి. తప్పులను ఒప్పుకుంటూనే భవిష్యత్తులో కాంగ్రెస్‌పై పోరాటానికి పార్టీని సమాయత్తం చేసే వ్యూహంతో కేటీఆర్ ఉన్నట్లు స్పష్టమవుతోంది.

# రిజర్వ్‌డ్ స్థానాలపై కమలం గురి

**హైదరాబాద్, జూలై 17, పెన్ పవర్:**
రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో ఎలాగైనా అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని బీజేపీ సరికొత్త రాజకీయ వ్యూహానికి తెరలేపింది. ఎస్సీ మోర్చా సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు చేసిన వ్యాఖ్యలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణలో అధికార పీఠాన్ని దక్కించుకోవాలంటే ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో గెలుపే అత్యంత కీలకమని, ఆ స్థానాలను టార్గెట్ చేస్తూనే పార్టీ శ్రేణులు పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో దళిత ఓటర్లు అత్యంత నిర్ణయాత్మక శక్తిగా ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న స్థానాల ప్రకారం చూస్తే, మొత్తం 119 అసెంబ్లీ స్థానాల్లో 19 స్థానాలు షెడ్యూల్డ్ కులాలకు రిజర్వ్ చేయబడ్డాయి. అలాగే మొత్తం 17 లోక్‌సభ స్థానాల్లో 3 స్థానాలు ఎస్సీలకు రిజర్వ్ అయి ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ఇవి డబుల్ అయ్యే అవకాశం ఉంది.గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రిజర్వ్‌డ్ స్థానాల్లో కాంగ్రెస్ ఏకపక్షంగా 14 స్థానాలను గెలుచుకోగా... బీజేపీ మాత్రం ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోయింది. అందుకే, ఈసారి ఆ పొరపాట్లను సరిదిద్దుకుని, క్షేత్రస్థాయి నుంచి పక్కా ప్లాన్‌తో వెళ్లాలని కమలదళం భావిస్తోంది.ఎస్సీ స్థానాలపై బీజేపీ కన్నేయడానికి అనేక కారణాలున్నాయి. రాష్ట్రంలో దాదాపు ప్రతీ నియోజకవర్గంలోనూ దళిత ఓటర్లు గెలుపోటములను శాసించే స్థాయిలో ఉన్నారు. ఈ వర్గాన్ని తమ వైపు తిప్పుకోకుండా తెలంగాణలో అధికారం సాధించడం అసాధ్యమని బీజేపీ అగ్రనాయకత్వం గుర్తించింది. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుంది, రిజర్వేషన్లను రద్దు చేస్తుంది.. అంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టడం బీజేపీ ప్రధాన ఉద్దేశం. జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేయడం ద్వారానే అక్కడ దళితులకు రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు లభించాయని, రిజర్వేషన్లను కాపాడిన హిస్టరీ కేవలం బీజేపీదేనని ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తోంది.ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన మూసీ సుందరీకరణ ప్రాజెక్టు వల్ల పేద దళిత బస్తీల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, వారికి సరైన పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందనే విమర్శను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని బీజేపీ ప్లాన్ చేస్తోంది. దళితులను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారనే భావనను కలిగించడం ద్వారా కాంగ్రెస్ మైలేజ్‌ను తగ్గించవచ్చనేది కమలనాథుల వ్యూహం.రాబోయే రోజుల్లో ఎస్సీ నియోజకవర్గాల్లో జెండా ఎగరేయడానికి బీజేపీ ఒక పక్కా రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. బూత్ స్థాయి నుంచి ఎస్సీ మోర్చా

కార్యకర్తలను యాక్టివ్ చేయడం, ప్రతీ దళిత వాడలోనూ స్థానిక సమస్యలపై పోరాటాలు చేయడం ఇందులో భాగం. మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న దళిత సంక్షేమ పథకాలు (ముద్రా లోన్లు, స్టాండప్ ఇండియా, పీఎం ఆవాస్ యోజన వంటివి) లబ్ధిదారుల ఇళ్లకు చేరేలా డోర్-టు-డోర్ క్యాంపెయిన్ నిర్వహించేందుకు పార్టీ సిద్ధమవుతోంది. దేశంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ వంటి దళిత, గిరిజన వర్గాలకు అత్యున్నత పదవులు కల్పించిన ఘనత బీజేపీదేనని చాటిచెప్పడం ద్వారా దళితులలో నమ్మకాన్ని పెంచాలని భావిస్తోంది.మొత్తానికి, గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, ఈసారి ఎస్సీ స్థానాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టిన బీజేపీ.. తెలంగాణలో తన పొలిటికల్ మైలేజ్‌ను పెంచుకోవడానికి గట్టిగానే ప్లాన్ చేస్తోంది. రాబోయే రోజుల్లో ఈ వ్యూహాలు ఎంతవరకు వర్కవుట్ అవుతాయో చూడాలి

# హస్తినకు పోయి రావలె...

**విజయవాడ, జూలై 17, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి త్వరలోనే దేశ రాజధాని ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ నెల 20వ తేదీ నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, అదే సమయంలో ఆయన ఢిల్లీ వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న రాజకీయ పరిణామాలు, లాకప్ డెత్ వ్యవహారాలూ తమ పార్టీ శ్రేణులపై జరుగుతున్న దాడుల అంశాన్ని జాతీయ స్థాయిలో చర్చకు పెట్టడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుందని సమాచారం. ఈ పర్యటనలో భాగంగా వైఎస్ జగన్ కేంద్ర ప్రభుత్వ పెద్దలను, ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా ఇతర కీలక నాయకులను కలిసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఏపీలో ప్రస్తుతం నెలకొన్న శాంతిభద్రతల పరిస్థితిపై ఆయన కేంద్రానికి ఒక సమగ్ర నివేదికను సమర్పించనున్నట్లు వైసీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడులు, ఆస్తుల ధ్వంసం మరియు నమోదైన కేసుల వివరాలను ఆయన కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్లనున్నారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలతో పాటు పార్లమెంట్ వేదికగా జాతీయ మీడియా మరియు ఇతర ప్రాంతీయ పార్టీల మద్దతు కూడగట్టేందుకు కూడా జగన్ వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. తమ పార్టీకి ఉన్న ఎంపీల ద్వారా పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఏపీ పరిణామాలపై గళం విప్పేలా ప్రణాళిక సిద్ధం చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడిన నాయకులను వేధిస్తున్నారనే కోణంలో కేంద్రానికి ఫిర్యాదు చేయడం ద్వారా, కూటమి ప్రభుత్వంపై జాతీయ స్థాయిలో ఒత్తిడి తీసుకురావచ్చని జగన్ భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**జగన్ ధీమా వెనుక...**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ నేతలను ఇంకా యాక్టివ్ చేయాల్సిన అవసరం ఉంది. ఎన్నికలు పూర్తయి రెండేళ్లవుతున్నా ఇంకా కొందరు నేతలు మాత్రమే పార్టీలో యాక్టివ్ రోల్ పోషిస్తున్నారు. అందులోనూ ఒక సామాజికవర్గానికి చెందిన నేతలే ఎక్కువగా మీడియాలో కనిపిస్తున్నారు. మిగిలిన నేతలు బయటకు రావడం లేదు. వైఎస్ జగన్ అనేక పర్యటనలు చేస్తున్నారు. జిల్లాలు తిరుగుతున్నారు. అయినా అక్కడి వరకే నేతలు పరిమితమవుతున్నారు. పూర్తి స్థాయిలో నేతలు యాక్టివ్ కాకపోవడంతో వైసీపీ క్యాడర్ కొంత అయోమయంలో ఉంది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండటంతో నేతలు కనెక్ట్ కాకుంటే గెలుపు అసాధ్యమని చెబుతున్నారు. జగన్ పర్యటనలు విజయవంతం అవుతున్నప్పటికీ ఎన్నికల సమయానికి క్యాడర్, లీడర్ కలసి పనిచేస్తేనే కొంత సక్సెస్ లభిస్తుంది. కానీ ఇప్పుడు దాదాపు వంద నియోజకవర్గాల్లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. దీనికి ప్రధాన కారణం ఇంకా వేచి చూడాలని నాయకులు అనుకోవడమే. ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు కొంత ఊపు మీద ఉన్నప్పటికీ వారికి అవసరమైన న్యాయ సాయాన్ని అందించడంలోనూ లీడర్లు విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో జగన్ అనేక సార్లు సమావేశాలు పెట్టి నేతలకు హిత బోధ చేసినప్పటికీ నేతల్లో మార్పులు రాకపోవడం, కొందరు టీడీపీ ఎమ్మెల్యేలతో కలసి వ్యాపారాలు సాగించడం వంటి కారణాలు ఈ పరిస్థితికి కారణమని కార్యకర్తలే నేరుగా ఆరోపణలు చేస్తున్నారు.. వైసీపీ అధినేత గా జగన్ ఈసారి కూడా తన వల్లనే పార్టీ గెలుస్తుందన్న భ్రమలో ఉన్నారు. కానీ ఆ భ్రమ నుంచి ఎంత త్వరగా బయటపడితే అంత మంచిదన్న సూచనలు వెలువడుతున్నాయి. గత ఎన్నికల్లో క్యాడర్ కు లీడర్ కు మధ్య సమన్వయ లేమితోనే దారుణ ఓటమి చవి చూడాల్సి వచ్చిందని చెబుతున్నారు. కానీ తన పర్యటనలకు వస్తున్న జనాలను చూసిన జగన్ కు మాత్రం ఈసారి కూడా తన బొమ్మ అధికారం తెచ్చి పెడుతుందన్న అతి విశ్వాసంతో ఉన్నారు. కానీ అవతల కూటమి కలసి ఉంటే గెలుపు అన్నది అంత సులువు కాదన్న విషయాన్ని గుర్తుంచుకుని వీలయినంత త్వరగా నియోజకవర్గాల వారీగా సమావేశాలు పెట్టుకుంటే మంచిదని కొందరు హితవు పలుకుతున్నారు. మరి జగన్ ఒకరి మాట వినేరకం కాదంటున్న వారు.. అది జరగని పని.. నష్టం జరిగేంత వరకూ ఆయనంతే అంటూ నిట్టూర్చే వారి సంఖ్య వైసీపీలో ఎక్కువగా ఉంది.

# టార్గెట్లతోనే జనసేన పని



**విజయవాడ, జూలై 17, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను జనసేన పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉన్న పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటి నుంచే క్షేత్రస్థాయి వ్యూహాలకు పదును పెడుతున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయాల జోష్‌ను స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగించాలని, జనసేన పోటీ చేసే ప్రతి స్థానంలోనూ ఖచ్చితంగా గెలిచి తీరాల్సిందేనని ఆయన పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు జనసేన ముఖ్య నాయకులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు పవన్ కళ్యాణ్ పక్కా టార్గెట్లను నిర్దేశిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో ప్రధానంగా ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహాలకు గట్టి గండి కొట్టాలని పవన్ కళ్యాణ్ పట్టుదలగా ఉన్నారు. గతంలో అధికార బలాన్ని ఉపయోగించి వైసీపీ ఏకగ్రీవాలు చేసుకున్న దుస్థితి మళ్లీ రాకూడదని, ఎక్కడా ఒక్క స్థానం కూడా వైసీపీ ఏకగ్రీవం కాకుండా పటిష్టమైన నిఘా మరియు వ్యూహాలు అమలు చేయాలని ఆయన ఆదేశించారు. కూటమిలోని మిత్రపక్షాలైన తెలుగుదేశం, బీజేపీలతో సమన్వయం చేసుకుంటూనే, జనసేన బలంగా ఉన్న ప్రాంతాల్లో మేజర్ స్థానిక సంస్థలను కైవసం చేసుకోవడమే ఏకైక లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ క్లీన్ స్వీప్ చేసిన 21 నియోజకవర్గాల్లోని మేజర్ స్థానిక సంస్థలపై పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. తాను అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకున్న ఆ 21 స్థానాల పరిధిలోని మున్సిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో మెజారిటీ స్థానాలను జనసేన ఖాతాలోనే వేయాలని ఆయన పట్టుదలతో ఉన్నారు. గ్రామీణ స్థాయి నుంచి పార్టీ క్యాడర్‌ను యాక్టివ్ చేయడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించి, క్షేత్రస్థాయిలో పార్టీ మూలాలను మరింత బలోపేతం చేయాలని పవన్ కళ్యాణ్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.

**సేనానికి సెగ**

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన సొంత పార్టీ నేతల నుంచే కొంత అసంతృప్తిని ఎదుర్కొంటున్నారు. పవన్ కళ్యాణ్ నయకత్వాన్ని ఎవరూ కాదనడం లేదు. కానీ పొరుగున ఉన్న తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తో పోల్చి మరోసారి చూపుతూ సోషల్ మీడియాలో వస్తున్న పోస్టింగ్ లు పవన్ ను కొంత ఇబ్బంది పెడుతున్నాయి. తమిళనాడులో మొన్నటి ఎన్నికల్లో విజయ్ గెలిచిన వెంటనే ఒంటరిగా పోటీ చేసి గెలిచాడని, మనం ఎందుకు చేయకూడదని జనసేన క్యాడర్ ప్రశ్నించినట్లు పవన్ కళ్యాణ్ ఒక సమావేశంలో చెప్పారు. అయితే తమిళనాడుకు, ఆంధ్రప్రదేశ్ కు చాలా తేడా ఉందని, తనను విజయ్ పార్టీతో పోల్చవద్దని కూడా పవన్ కళ్యాణ్ పదే పదే చెబుతున్నారుకాగా తమిళనాడు లో విజయ్ సినీ రంగం నుంచి నేరుగా రాజకీయ రంగంలోకి వచ్చారు. అయినా సరే ఏ మాత్రం జంకుబొంకు లేకుండా పాలన చేస్తున్నారు. పాలనలో తన మార్క్ ను విజయ్ చూపుతున్నాడు. అవినీతికి వ్యతిరేకంగా విజయ్ తీసుకుంటున్న నిర్ణయాలు దేశ వ్యాప్తంగా చర్చకు కారణమయ్యాయి. అలాగే ఆకస్మిక తనిఖీలతో విజయ్ ప్రభుత్వ అధికారుల వెన్నుల్లో వణుకు పుట్టిస్తున్నారు. మద్యం విషయంలోనూ, ఇచ్చిన హామీల అమలు విషయంలోనూ ఎక్కడా విజయ్ నిధులు లేవు అని చెప్పడం లేదు. అలాగే ప్రత్యర్థులపై విరుచుకుపడుతూనే తన లక్ష్యమేంటో ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. అయినా తనకు ఎక్కడా రాజకీయ అనుభవం లేదని ఆయన చెప్పుకోవడం లేదు.. కానీ పవన్ కల్యాణ్ మాత్రం తరచూ తనకు పాలన అనుభవం తక్కువని, అందుకే తాను పొత్తు పెట్టుకోవాల్సి వస్తుందని చెప్పడాన్ని జనసైనికులే తప్పుపడుతున్నారు. ఒక ముఖ్యమంత్రికి పాలనా అనుభవం అవసరం లేదని, సామాజిక స్పృహ ఉంటే సరిపోతుందని, పాలనపరమైన వ్యవహారాలను ఉన్నతాధికారులు చూసుకుంటారని, అనుభవజ్ఞులైన మంత్రులను పెట్టుకుంటే పాలన చేయడం పెద్ద కష్టమేమీ కాదని, అలాగనుకుంటే ఎవరూ క్రమేపీ ముఖ్యమంత్రి కాలేదని, తొలిసారి నేరుగా ముఖ్యమంత్రి అయి ఎన్నో జనరంజక కార్యక్రమాలన చేపట్టిన విషయాలను ఈ సందర్భంగా కొందరు సోషల్ మీడియాలో గుర్తు చేస్తున్నారు. కానీ అనుభం లేదన్న సాకుతో పదిహేనేళ్లు పొత్తు పెట్టుకుంటామని చెబుతుండటాన్ని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కానీ పవన్ షణ్ముఖ వ్యూహం ఏంటో తెలియదని, అది తెలిసిన తర్వాత తమ గళం విప్పుతామని కొందరు అంటున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల సవాల్

**విజయవాడ, జూలై 17 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబా బు స్థానిక సంస్థల ఎన్నికలను సవాల్ గా తీసుకున్నారు. ముం దుగా మున్సిపల్ ఎన్నికలను నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. పట్టణ ఓటర్లు కొంత భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని ఓట్లు వేస్తారని చంద్రబాబు నమ్మకం కావచ్చు. పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికలు తర్వాత జరపాలని చంద్రబాబు ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. పట్టణ ప్రాంత ఓటర్లయితే రాష్ట్రంలో జరిగే అభివృద్ధితో పాటు తన పాలనకు, గత పాలనకు బేరీజు వేసుకుని ఓటు వేస్తారని ఆయన నమ్మకంగా ఉన్నట్లుంది. అందుకే తొలుత మున్సిపల్ ఎన్నికలకు వెళ్లాలని చంద్రబాబు నిర్ణయించారు. అయితే మున్సిపల్ ఎన్నికలలోనూ కూటమితో కలసి పోటీ చేస్తుండటంతో దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చంద్రబాబు నిన్న సాయంత్రం జనసేన, బీజేపీ నేతలతో సమావేశమయ్యారు. క్షేత్రస్థాయిలో మూడు పార్టీల కార్యకర్తల మధ్య ఇబ్బందులు, అపోహలు లేకుండా చూసుకునేందుకు జిల్లాలు, నియోజకకవర్గాల వారీగా సమావేశాలు పెట్టుకుంటే బాగుంటుందని సూచించారు. ఏ పార్టీకి ఆ పార్టీ సమావేశాలు పెట్టుకుని తమకు బలం ఉన్న ప్రాంతంలో పోటీ చేసే విధంగా క్యాడర్ ను సమాయత్తం చేయాలని చెప్పినట్లు తెలిసింది. దీంతో పాటు ఇక రాష్ట్ర స్థాయిలో కూడా కూటమి సమన్వయ కమిటీ సమావేశాలు తరచూ జరిగేలా ఒక క్యాలెండర్ ను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. . దీనివల్ల మిత్ర పక్షాల మధ్య ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా ఎన్నికలకు వెళ్లవచ్చని చంద్రబాబు అభిప్రాయపడుతున్నారు. ా×= ప్రక్రియ పూర్తయిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో చంద్రబాబు ఉన్నారు. ఇదే విషయాన్ని కూటమి సమావేశంలో చెప్పినట్లు తెలిసింది. ప్రభుత్వం గత రెండేళ్లుగా చేసిన మంచి పనులను ప్రజలకు వివరించేలా మూడు పార్టీలు కలసి అన్ని ప్రాంతాల్లో సమావేశాలను ఏర్పాటు చేసుకుని ప్రజలను చైతన్య వంతుల్ని చేయాలని నిర్ణయించారు. ఇక సీట్ల సర్దుబాటు విషయంలో స్థానిక ఎమ్మెల్యేలతో పాటు అక్కడి నేతల అభిప్రాయాలను కూడా తీసుకుని తర్వాత చేసుకుంటే కొంత సత్ఫలితాలనిస్తుందన్న అంచనాలో చంద్రబాబు ఉన్నారు. మున్సిపాలిటీలను క్లీన్ స్వీప్ చేస్తే ఇక తమకు మిగిలిన ఎన్నికల్లో తిరుగుండదని భావిస్తున్నారు.

**అధికారులపై గుస్సా**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల కాలంలో అధికారుల పనితీరు, పాలనపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో వ్యవస్థలను గాడిలో పెట్టాలని, అధికారుల పనితీరు మారాలని ఆయన స్పష్టం చేశారు. పరిపాలనలో గతంలో జరిగిన తప్పులను పునరావృతం చేయవద్దని, విధులు సక్రమంగా నిర్వర్తించాలని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను ఉపేక్షించేది లేదంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించేలా, తప్పుడు ప్రచారాలు, వ్యక్తిత్వ హననానికి పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. కులాలు, మతాల పేరుతో చిచ్చుపెట్టే ప్రయత్నాలను తిప్పికొట్టాలని, పబ్లిక్ గ్రీవెన్స్ సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అయినా కొందరు అధికారులు కొంత ప్రభుత్వానికి నెగిటివ్ గా పనిచేస్తున్నారని చంద్రబాబుకు అవగతమయింది. కొందరు కీలక స్థానంలో ఉన్న అధికారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని, ఇటువంటి వారిని గుర్తించి జాగ్రత్తగా లేకపోతే భారీ నష్టం తప్పదని మంత్రులను హెచ్చరించారు. ఇటువంటి వారిని గుర్తించి అవసరమైతే వారిని ఆ యా స్థానాల నుంచి తప్పించాలని కూడా మంత్రులకు ఆదేశించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత ఈ విషయం అర్థమయినట్లుంది. గత కొంతకాలంగా ప్రత్యర్థి పార్టీలకు ప్రభుత్వ సమాచారం అందుతుండటంతో పాటు అన్ని రకాల డాక్యుమెంట్లు కూడా వెళుతుండటాన్ని చంద్రబాబు గమనించారు. వాటిని పట్టుకుని వైసీపీ నేతలు తమను విమర్శిస్తున్నారని, అయితే ఇటువంటి వారిపై జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించడం ఇప్పుడు అధికార వర్గాల్లో చర్చగా మారింది. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా అధికారులను తన నియంత్రణలో ఉంచుకుంటారు.

## మైనర్ బాలిక తో అసభ్య ప్రవర్తన స్థానికుల దాడిలో మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** కులసుంపుర పోలీస్ స్టేషన్ లో దారుణం జరిగింది. తొమ్మిదేళ్ల మైనర్ బాలిక పై అసభ్యంగా ప్రవర్తిస్తున్న వీడియోస్ సీసీ టీవిలో రికార్డు ఐయ్యాయి మైనర్ బాలికకు ముద్దు ఇస్తూ, ప్రైవేట్ పార్ట్స్ తాకుతున్న వీడియోస్ బాలిక తల్లి తండ్రులు, స్థానికులు చూసారు. ఆవేశం తో నిందుతుడిపై పేరెంట్స్ డబుల్ బెడ్ రూమ్ వాసులు దాడి చేయగా, ఉస్మానియా హాస్పటల్ లో చికిత్స పొందుతు మృతి చెందాడు. కుల్సుంపుర పోలీస్ స్టేషన్ పరిధిలో ఇందిరమ్మ డబుల్ బెడ్ ట బ్లాక్ లో ఘటన జరిగింది. నిందుతుడు హాజిజ్ అబ్దుల్ నీలోఫోర్ హాస్పిటల్ లో టీ అమ్ముతు జీవనం కొనసాగిస్తున్నాడు. మైనర్ బాలిక 4వ క్లాస్ చదువుతుండగా, పేరెంట్స్ ప్రైవేట్ జాబ్స్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీడియోలు చూసిన స్థానికులు అబ్దుల్ పై దాడి చేసారు. తీవ్ర గాయాలయిన అబ్దుల్ ను పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అబ్దుల్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 9 రూపాయిలకు చేరిన కోడిగుడ్డు ధర

**కాకినాడ, జూలై 17, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో కోడి గుడ్డు ధర సామాన్యుడిపై గుదిబండలా మారింది. కోళ్ల ఫారాల వద్దే ఒక్కో కోడి గుడ్డు రూ. 6.95 పైసలతో రికార్డు స్థాయికి చేరుకుంది. ఇప్పటి వరకు ఇదే అత్యధిక ధర కావడం విశేషం. ఫారాల వద్ద రూ. 6.95 పైసలు ఉన్న కోడి గుడ్డు ధర రిటైల్ మార్కెట్‌లో రూ. 8.50 పైసలకు పైగానే పలుకుతుంది. గతేడాది ఇదే రోజున రూ. 4.90 పైసలు ఉండగా ఇప్పుడు డబుల్ అయింది. నిత్యావసర ధరలు రోజురోజుకూ పెరిగిపోతూనే ఉన్నాయి. తాజాగా కోడిగుడ్డు ధర కూడా ఆకాశాన్ని తాకింది. మిడిల్ క్లాస్ ఇళ్లల్లో నాన్ వెజ్‌కి ప్రత్యామ్నాయంగా ఉన్న గుడ్డు ధర చూసి ప్రజలు షాక్ అవుతున్నారు. కోళ్ల ఫారాల దగ్గరే రికార్డు స్థాయికి ధర చేరగా.. ఇక బయట మార్కెట్లలో ఏ రకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సడెన్‌గా పెరిగిన ఈ కోడి గుడ్డు రేటుతో సామాన్యుడు సతమతమవుతున్నాడు. తూర్పుగోదావరి జిల్లాలో కోళ్ల ఫారాలు చాలా ఎక్కువ. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాలకు కూడా ఇక్కడి గుడ్లే ఎగుమతి అవుతుంటాయి. అలాంటి తూర్పు గోదావరి జిల్లాలో కోళ్ల ఫారం వద్దే గుడ్డు ధర రూ. 6.95 పైసలు ఉంది. ఇప్పటి వరకు కోడి గుడ్డు ధర అత్యధికంగా ఉన్న రేటు కూడా ఇదే కావడం విశేషం. తూర్పు గోదావరి జిల్లాలో సాధారణంగా 1.3 కోట్లకు పైగా కోళ్లు ఉండగా రోజుకు కోటి వరకు గుడ్లు ఉత్పత్తి అవుతుండటం సర్వసాధారణం. ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉండటం వల్ల కోళ్లు కూడా చాలా ఎక్కువగానే మృతిచెందాయి. అధికారికంగా ఈ సంఖ్యం 16.35 లక్షలు ఉండగా, అనధికారికంగా 20 లక్షలకు పైగా కోళ్లే మృతి చెందాయని రైతులు చెబుతున్నారు. దాంతో పాటు బతికిన కోళ్లు కూడా పూర్తి స్థాయిలో గుడ్లు పెట్టకపోవడంతో గుడ్ల కొరత ఏర్పడింది. ప్రస్తుతం కోళ్ల ఫారాల వద్ద గుడ్డు ధర రూ. 6.95 పైసలు ఉండగా, అదే బహిరంగ మార్కెట్‌లో రూ. 8.50 పైసలకు పైనే విక్రయిస్తున్నారు. గతేడాది ఇదే రోజు రూ. 4.94 పైసలు ఉండగా ఇప్పుడు ఆ ధర రెట్టింపయింది. దీంతో పాటు కిలో చికెన్ ధర కూడా రూ. 300కు పైమాటే. దాణా ధరలు విపరీతంగా పెరగడంతోనే ఈ ధరలు పెరిగాయని రైతులు అంటున్నారు. సోయా ధర టన్ను రూ. 40 వేల నుంచి రూ. 65 వేలకు, నూనె తీసిన తౌడు ధర రూ. 12 వేల నుంచి రూ. 22 వేలకు మొక్కజొన్న ధర కూడా పెరిగిందని రైతులు చెబుతున్నారు.

## పవన్ ఆదర్శం... ఆచరించాల్సిన బాట

**గుంటూరు, జూలై 17: పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విలువల మార్పు, ప్రజాధనం వినియోగంపై సరికొత్త చర్చ తెరపైకి వచ్చింది. ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రజాధనాన్ని ఆదా చేసే విషయంలో ఒక నూతన సంప్రదాయానికి నాంది పలికారు. చట్ట ప్రకారం ఒక మంత్రిగా లేదా ప్రజాప్రతినిధిగా తమ వ్యక్తిగత వైద్య ఖర్చులు, ప్రయాణాలు, ఇతర ప్రోటోకాల్ ఖర్చులకు ప్రభుత్వ నిధులను వాడుకునే హక్కు, వెసులుబాటు ఉన్నప్పటికీ.. వీరిద్దరూ తమ వ్యక్తిగత అవసరాలకు పూర్తిగా సొంత డబ్బులనే ఖర్చు పెట్టుకుంటున్నారు. రాజకీయాల్లోకి కేవలం సేవ చేయడానికే వచ్చామంటూ, కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ప్రభుత్వ ఖజానాలోనే మిగిల్చేలా వీరు తీసుకున్న నిర్ణయం కొత్త మార్పునకు దారి తీసే అవకాశం కనిపిస్తోంది. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐదేళ్ల హయాంలో పాలకులు ప్రదర్శించిన తీరుతో పోల్చి చూస్తే ఈ మార్పును ప్రముఖంగా హైలెట్ అవుతోంది. గత ప్రభుత్వంలో కొందరు మంత్రులు, కీలక నేతలు చిన్నపాటి తలనొప్పి, తుమ్ములు, దగ్గులు వచ్చినా సరే.. పక్క రాష్ట్రమైన హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేరిపోయేవారు. ఆ వైద్య బిల్లుల మొత్తాన్ని ఏకంగా ప్రభుత్వ శాఖల ద్వారా రీఇంబర్స్‌మెంట్ చేయించుకుని, ప్రజాధనాన్ని అడ్డగోలుగా వాడుకునేవారు. కేవలం ప్రజాప్రతినిధుల వైద్యం పేరుతోనే కోట్ల రూపాయల ఖజానా నిధులు పక్కదారి పట్టగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్, లోకేష్ వంటి అగ్రనేతలు ఆ పద్ధతికి స్వస్తి పలికి మిగతా వారికి ఆదర్శంగా నిలిచారు. చట్టపరంగా లేదా ఒకే ఒక్క జీవో ద్వారా ప్రజాప్రతినిధులందరికీ ఈ వైద్య, వ్యక్తిగత సౌకర్యాల ఖర్చులను పూర్తిగా రద్దు చేయడం ప్రభుత్వానికి సాధ్యం కాదు. ఎందుకంటే, శాసనసభలో ఉండే ఎమ్మెల్యేలందరూ ఒకే ఆర్థిక స్తోమత కలిగిన వారు కాదు. వారిలో సామాన్య మధ్యతరగతి నుంచి గెలిచిన పేద ఎమ్మెల్యేలు, దళిత, గిరిజన వర్గాల నేతలు కూడా ఉంటారు. ఏదైనా తీవ్ర అనారోగ్యం పాలైనప్పుడు వారికి ప్రభుత్వ పరంగా లభించే ఈ చట్టబద్ధమైన సదుపాయం ఎంతో అవసరం. కానీ, కోట్ల రూపాయల వ్యాపారాలు, భారీ ఆస్తులు ఉండి ఆర్థికంగా అత్యంత పటిష్టమైన స్థితిలో ఉన్న ధనిక ప్రజాప్రతినిధులు కూడా ఇదే సదుపాయాన్ని గుడ్డిగా వాడుకోవడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న ఉదయిస్తోంది. రాజకీయ విశ్లేషకులు ఒక సరికొత్త , విప్లవాత్మకమైన ప్రతిపాదనను తెరపైకి తెస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నవారు తమ గ్యాస్ సబ్సిడీని స్వచ్ఛందంగా వదులుకోవాలంటూ గివ్ ఇట్ అప్ ప్రచారాన్ని విజయవంతంగా నడిపినట్లుగానే.. ఏపీ అసెంబ్లీలో కూడా ఒక నూతన విధానాన్ని తీసుకురావాలని సూచిస్తున్నారు. ఆర్థికంగా శక్తి సామర్థ్యాలు ఉన్న ప్రజాప్రతినిధులు ఎవరైనా.. తాము ప్రభుత్వం నుంచి ఎలాంటి వ్యక్తిగత లేదా వైద్య రీఇంబర్స్‌మెంట్లు తీసుకోబోమని స్వచ్ఛందంగా ఒక డిక్లరేషన్ సమర్పించే పద్ధతిని ప్రవేశపెట్టాలి. ఇలాంటి డిక్లరేషన్ విధానం కనుక అమల్లోకి వస్తే, అది దేశ రాజకీయాల్లోనే ఒక చారిత్రాత్మక మార్పు అవుతుంది. పవన్ కళ్యాణ్, నారా లోకేష్ వంటి వారు ఇప్పటికే ఆచరణలో చూపిస్తున్న ఈ విధానాన్ని అధికారికంగా మార్చి, ఇతర ధనిక ఎమ్మెల్యేలు కూడా డిక్లరేషన్ ఇచ్చేలా ప్రోత్సహిస్తే.. ఏటా వందల కోట్ల ప్రజాధనం ఆదా అవుతుంది. అంతేకాకుండా, ప్రజాప్రతినిధులపై ప్రజల్లో గౌరవం ,విశ్వసనీయత మరింత పెరుగుతాయి.

**20 లక్షల ఖర్చు**

ఎన్నో ఏళ్ళ నుండి ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి ని వెంటాడుతున్న భుజాల నొప్పి సమస్యకు శాశ్వత పరిష్కారం చేసుకోవడం కోసం , రీసెంట్ గానే ముంబై కి వెళ్లి అంబానీ హాస్పిటల్ లో సర్జరీ చేయించుకున్న సంగతి తెలిసిందే. ఎలాంటి కాంప్లికేషన్స్ లేకుండా, కేవలం మూడున్నర గంటల్లోనే పవన్ కళ్యాణ్ కి సర్జరీ పూర్తి చేశారు వైద్యులు. కాసేపటి క్రితమే పవన్ కళ్యాణ్ ఆ హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయ్యారు. ముందుగా రెండు భుజాలకు ఒకేసారి సర్జరీ చేయించుకోవాలని అనుకున్నారు పవన్ కళ్యాణ్. కానీ ఒకేసారి రెండు భుజాలకు సర్జరీ చేస్తే, నొప్పి భరించలేని స్థాయిలో ఉంటుందని డాక్టర్లు చెప్పడం తో , ముందుగా కుడి భుజానికి సర్జరీ చేశారు. నాలుగు నెలలు పూర్తి అయ్యాక ఎడమ భుజానికి కూడా సర్జరీ చేయనున్నారు. అయితే ఈ సర్జరీ కి అయ్యే ఖర్చు మొత్తాన్ని పవన్ కళ్యాణ్ తన సొంత డబ్బులను వెచ్చించారు. మంత్రి పదవుల్లో ఉన్నవారికి ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు , ప్రభుత్వ నిధులు ఉపయోగించుకోవచ్చు. ఆ వెసులుబాటు ఉన్నప్పటికీ కూడా పవన్ కళ్యాణ్ తన సొంత డబ్బులతో చేయించుకున్నారు. దీంతో ఆయన జనాల డబ్బులకు ఎంత విలువని ఇస్తున్నారో అర్థం అవుతోంది అంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇదంతా పక్కన పెడితే పవన్ కళ్యాణ్ సర్జరీ కి ఎంత ఖర్చు అయ్యింది అనే అంశంపై సోషల్ మీడియా లో పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. రొటేటర్ కఫ్స్ సర్జరీ చాలా సున్నితమైనది. ఎంతో అనుభవం , నైపుణ్యం ఉన్న డాక్టర్లు మాత్రమే ఈ సర్జరీ చేయగలరు. అందుకే ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచిన కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో ఆయన సర్జరీ చేయించుకున్నారు . సాధారణ హాస్పిటల్స్ కంటే , ఇక్కడ సర్జరీ కి చాలా ఎక్కువ ఖర్చు అవుతుంది. పైగా స్పెషలిస్టులు సర్జరీ చేస్తారు కాబట్టి దాదాపుగా 20 లక్షల వరకు ఖర్చు అయ్యిందని సమాచారం. సాధారణంగా మామూలు రొటేటరీ కఫ్స్ సర్జరీ అయితే 5 నుండి 10 లక్షల రూపాయిల లోపే ఖర్చు అవుతుంది. కానీ పవన్ కళ్యాణ్ కేసు చాలా కాంప్లికేటెడ్. పదేళ్ల నుండి ఆ గాయాలు బాగా ముదిరిపోయాయి. అందుకే ఇంత ఖర్చు అయ్యింది. ఎడమ భుజానికి కూడా మరో 20 లక్షల రూపాయిలు ఖర్చు అవుతుందని , ఈ స్థాయి డబ్బులతో సాధారణ మధ్యతరగతి కుటుంబానికి సంబంధించిన వాళ్ళు ఒక ఇంటిని కొనేయొచ్చు అంటూ సోషల్ మీడియా లో నెటిజెన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# బీజేపీకి బిగ్ టెస్ట్.. ఇంకా 11 మంది కావాలి? ఇప్పుడెలా?



పార్లమెంటు వర్షాకాల సమావేశాల నేపథ్యంలో జాతీయ రాజకీయాలు తీవ్ర ఉత్కంఠ రేపుతున్నాయి. ఈ సమావేశాల్లో దేశభవిష్యత్తును నిర్ణయించే బిల్లులను ప్రవేశపెట్టాలని కేంద్రం భావిస్తోంది. అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న మహిళా రిజర్వేషన్, పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన బిల్లుల ఆమోదానికి అవసరమైన మెజార్టీ సాధించేందుకు ముమ్మర కసరత్తు చేస్తోందని చెబుతున్నారు. ఇందులో భాగంగా విపక్షం ఇండి కూటమిలోని పలు ప్రధాన పార్టీలను టార్గెట్ చేసింది.

గత సమావేశాల్లో 2/3 వంతు మెజార్టీ లేక ఈ రెండు బిల్లులు వీగిపోయాయి. ఈ పరిణామాన్ని అవమానకరంగా భావించిన అధికార బీజేపీ పెద్దలు ఆ తర్వాత వ్యూహాత్మకంగా పావులు కదిపి విపక్షాన్ని ఆత్మరక్షణలోకి నెట్టేశారు. గత సమావేశాల్లో విపక్షం తరఫున గట్టిగా నిలబడిన టీఎంసీ, శివసేన (యూబీటీ), ఎన్సీపీ (శరద్ పవార్) ప్రస్తుతం అంతర్గత సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. అదే సమయంలో కాంగ్రెస్ తో విభేదాలతో డీఎంకే కూటమికి దూరమైంది. ఈ పరిణామాలు అన్నీ అధికార పార్టీకి కలిసివస్తున్నట్లు భావిస్తున్నా బిల్లుల ఆమోదానికి తగిన సంఖ్యాబలం ఇప్పటికీ సమకూరలేదని అంటున్నారు.పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లులు ఆమోదానికి 2/3వ వంతు మెజార్టీ తప్పనిసరి. అంటే ప్రస్తుత లోక్ సభ సభ్యుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న బిల్లులు ఆమోదం పొందాలంటే 360 మంది సభ్యుల మద్దతు అవసరం. కానీ ప్రస్తుతం ఎన్డీఏకి కేవలం 293 మంది ఎంపీల బలమే ఉంది. ఇక మారిన రాజకీయ పరిణామాలతో తృణమూల్ కాంగ్రెస్ పార్టీని ధిక్కరించిన 20 మంది ఎంపీలు, శివసేన (యూబీటీ) నుంచి బయటకి వచ్చిన ఆరుగురు ఎంపీలు ఎన్డీఏకి మద్దతుగా నిలిస్తే అప్పుడు ప్రభుత్వం బలం సభలో 319కి చేరుతుందని అంటున్నారు. అదే సమయంలో శరద్ పవార్ నాయకత్వంలోని ఎన్సీపీకి చెందిన 8 మంది ఎంపీలు కూడా ప్రభుత్వానికి జై కొడితే మొత్తం బలం 327 అవుతోంది. అంటే అప్పటికీ ఇంకా 33 మంది ఎంపీలు మద్దతు అవసరం అవుతుందని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో 22 మంది ఎంపీలు ఉన్న డీఎంకే ప్రభుత్వానికి మద్దతుగా నిలిస్తే మొత్తం బలం 349కి చేరుకుంటుందని చెబుతున్నారు.ఈ పరిస్థితుల్లో బిల్లులు ఆమోదానికి ఇంకా 11 మంది మద్దతు కూడగట్టాల్సివుందని అంటున్నారు. అయితే ఏపీకి చెందిన వైసీపీ బయటి నుంచి కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం వల్ల ఈ అంతరం ఏడుకి చేరింది. దీంతో కేంద్రం కాంగ్రెస్ పార్టీకి సన్నిహితంగా ఉన్న ఇండిపెండెంట్లతోపాటు మరికొన్ని చిన్నపార్టీలపై దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీలో మమత వెనుక ఉన్న ఎంపీలతోనూ చర్చలు సాగిస్తోందని చెబుతున్నారు. అయితే ఇవన్నీ మహారాష్ట్ర వృద్ధ నేత శరద్ పవార్ నాయకత్వంలోని 8 మంది ఎంపీలు మద్దతు ఇస్తేనే సాధ్యమయ్యే పరిస్థితులు ఉన్నాయని అంటున్నారు. కొన్ని రోజులుగా ఎన్సీపీ (ఎస్పీ) నేతలతో బీజేపీ ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నవీస్ వరుసగా చర్చలు జరుపుతున్నారు. మహిళా రిజర్వేషన్ విషయంలో ప్రభుత్వానికి మద్దతుగా ఇస్తామని చెబుతున్న ఎన్సీపీ (ఎస్పీ) డీలిమిటేషన్ బిల్లు విషయంలోనే మెలిక పెడుతోందని ప్రచారం జరుగుతోంది.గడిచిన రెండు వారాలుగా ఎన్సీపీ (ఎస్పీ) నేతలతో కేంద్రం తరఫున మహారాష్ట్ర ముఖ్యమంత్రితోపాటు ఇతర సీనియర్ నేతలు సంప్రదింపులు జరుపుతున్నా ఇప్పటివరకు క్లారిటీ లభించలేదని అంటున్నారు. దీంతో కేంద్రం మరికొన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో రానున్న రెండుమూడు రోజుల్లో ఏం జరగనుందనేది ఆసక్తి రేపుతోంది. ఈ నెల 20న పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కానుండగా, మెజార్టీపై నమ్మకం కలిగిన వెంటనే బిల్లులు లోక్ సభలో ప్రవేశపెట్టేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తోందని అంటున్నారు. దీంతో పార్లమెంటు వర్షాకాల సమావేశాలపై దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాలు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాయి.

# కూతురు 'సియా' చేసిన పాపానికి 'ప్రాయశ్చిత్తం' కోరుతున్న తండ్రి ఆవేదన..



దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన కేతన్ అగర్వాల్ హత్య కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. కాబోయే భర్తను అత్యంత దారుణంగా లోయలోకి తోసి హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన నిందితురాలు సియా గోయల్ తండ్రి ప్రవీణ్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం ఇరు రాష్ట్రాల్లోనే కాక దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. కన్నకూతురు చేసిన ద్రోహం ఒకవైపు.. సమాజం నుండి ఎదురవుతున్న ఛీత్కారాలు మరోవైపు.. వెరసి ఓ తండ్రిగా ఆయన అనుభవిస్తున్న నరకయాతన ఈ వ్యాఖ్యల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

**క్షమించరాని నేరం.. కఠినంగా శిక్షించండి**

మీడియాతో మాట్లాడిన ప్రవీణ్ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. చట్టం ముందు కన్నప్రేమ ఓడిపోయిందంటూ కన్నీరు పెట్టుకున్నారు. "నా కూతురు తప్పు చేసిందని కోర్టులో నిరూపితమైతే ఎలాంటి కనికరం చూపించవద్దు. ఆమెకు అత్యంత కఠినమైన శిక్ష విధించండి. అవసరమైతే ఉరితీసి.. కేతన్ దగ్గరకే పంపించేయండి. కేతన్ ఎలాంటి తప్పు చేయలేదు. అతడు కేవలం నా కూతురిని పెళ్లి చేసుకుని ఒక మంచి జీవితాన్ని ఇవ్వాలని మాత్రమే అనుకున్నాడు. ఒకవేళ సియాకు ఆ పెళ్లి ఇష్టం లేకపోతే మాకు ముందుగానే చెప్పి ఉండాల్సింది. ఆమె నిర్ణయాన్ని మేము గౌరవించేవాళ్లం. కానీ ఇలా ఒక అమాయకుడి ప్రాణం తీయడం క్షమించరాని నేరం." అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక తండ్రిగా కేతన్ కుటుంబం పడుతున్న కడుపుకోతను తాను అర్థం చేసుకోగలనని.. ఈ పాపంలో సియాకు పోలీసులు ఎలాంటి మినహాయింపులు ఇవ్వకూడదని ఆయన డిమాండ్ చేశారు.

**ఆ తప్పుకు మా కుటుంబాన్ని శిక్షించకండి..**

కూతురు చేసిన ఘాతుకానికి తమ కుటుంబం ఇప్పటికే సమాజం దృష్టిలో దోషిగా నిలబడిందని ప్రవీణ్ వాపోయారు. తాము మానసికంగా చచ్చి బతుకుతున్నామని, ప్రతిక్షణం నరకం చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టుపక్కల వారు, సమాజం తనిని, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శిస్తున్నారని తెలిపారు. ఇంట్లో నుంచి బయటకు రాలేని పరిస్థితుల్లో తీవ్రమైన మానసిక ఒత్తిడితో బతుకుతున్నట్లు పేర్కొన్నారు. "ఆమె చేసిన తప్పుకు ఇప్పటికే మా కుటుంబం సర్వస్వం కోల్పోయింది. దయచేసి సమాజం మమ్మల్ని ఇంక శిక్షించవద్దు" అంటూ ఆయన చేతులెత్తి వేడుకున్నారు.

**దర్యాప్తు ముమ్మరం చేసిన సిట్**

మరోవైపు ఈ కేసును మహారాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం అత్యంత వేగంగా విచారిస్తోంది. సియా గోయల్ తన ప్రియుడు చేతన్‌తో కలిసి ముందస్తు ప్రణాళిక ప్రకారమే కేతన్‌ను లోయలోకి తోసి చంపినట్లు ప్రాథమిక ఆధారాలు సేకరించారు.

ఇప్పటికే ఘటనా స్థలంలో సీన్ రీక్రియేషన్ పూర్తి చేసిన పోలీసులు, నిందితుల బ్యాంక్ లావాదేవీలను సైతం పరిశీలించారు. కేతన్ ద్వారా వచ్చిన డబ్బును సియా తన ప్రియుడు చేతన్‌కు బదిలీ చేసినట్లు సాంకేతిక ఆధారాలు లభ్యమయ్యాయి. ఈ కేసు దర్యాప్తు తుది దశకు చేరుకుందని.. త్వరలోనే పూర్తి వివరాలను అధికారికంగా వెల్లడిస్తామని పోలీసు వర్గాలు స్పష్టం చేశాయి.

# సినిమా ట్విస్టులను మించేలా.. దళపతి విజయ్ సర్కార్ కూల్చేందుకు కుట్రలు?



యాక్టర్ టు పొలిటీషియన్ గా మారి పార్టీ పెట్టిన రెండేళ్లలోనే సంచలన విజయం నమోదు చేసిన తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ సర్కారును కూల్చేందుకు భారీ కుట్ర జరిగిందని పోలీసుల విచారణలో వెల్లడైనట్లు ప్రచారం జరుగుతోంది. 'ప్రాజెక్టు మేఘాలయ' అనే పేరుతో డీఎంకే పార్టీకి చెందిన మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ, ఆయన సోదరుడు అశోక్ తోపాటు కొందరు జర్నలిస్టులు, యూట్యూబర్లు కలిసి టీవీకే ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర చేసినట్లు ఆధారాలు లభించాయని పోలీసులు ప్రభుత్వానికి అంతర్గత నివేదిక సమర్పించినట్లు చెబుతున్నారు. ఇప్పటికే ఓ సీనియర్ జర్నలిస్టును విచారించిన పోలీసులు అతడి మొబైల్ ను స్వాధీనం చేసుకోవడం హాట్ టాపిక్ అవుతోంది. ఈ నేపథ్యంలో ఈ కుట్రకు పాల్పడిన వారిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఉత్కంఠ రేపుతోంది.గత ఏప్రిల్ లో జరిగిన ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించిన టీవీకే పార్టీ మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వాన్ని నడపడానికి అవసరమైన బలం సొంతంగా లేకపోవడంతో విజయ్ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చని విపక్షాలు హెచ్చరిస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో టీవీకేకు చెందిన 15 మంది ఎమ్మెల్యేలతో బేరసారాలు జరిగాయని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని ఐపీడీఎస్ అనే ఓపీనియన్ పోల్ సంస్థ నిర్వాహకుడు, యూట్యూబర్ తిరునావుక్కరసు తనకు రూ.35 కోట్లు ఆఫర్ చేశారని ఊతంగరై ఎమ్మెల్యే ఎన్.ఇళయరాజా గతంలోనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదుపై ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తునకు ఆదేశించగా, ఇప్పటివరకు సుమారు 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. తిరునావుక్కరసుతోపాటు ఒక ప్రముఖ న్యూస్ చానల్ కి చెందిన సీనియర్ జర్నలిస్టు కూడా ఈ కుట్రలో భాగం అయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఆయనను విచారించిన పోలీసులు మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఫోన్ లో కీలక సమాచారం సేకరించారని ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వాన్ని కూల్చేందుకు వీరంతా కుట్ర చేయడమే కాకుండా, తమ ఆపరేషన్ కు 'ప్రాజెక్టు మేఘాలయ' అనే పేరు పెట్టారని చెబుతున్నారు. ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్న ఈ కేసు దర్యాప్తు పెను సంచలనంగా మారే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ప్రధానంగా డీఎంకే పార్టీకి చెందిన సీనియర్ నేతలకు ఉచ్చు బిగించేలా పోలీసులు అడుగులు వేస్తున్నారనే ప్రచారం ద్రవిడ రాజకీయాలను వేడెక్కిస్తోంది. ప్రస్తుతం కొందరు పాత్రధారులను అరెస్టు చేసినప్పటికీ వారిచ్చిన సమాచారంతో సూత్రధారులను త్వరలో అదుపులోకి తీసుకోవచ్చునని అంటున్నారు. దీంతో డీఎంకేలో ఏ స్థాయి నేతల పాత్ర బయటపడుతుందనే టెన్షన్ కనిపిస్తోందని అంటున్నారు. ప్రస్తుతానికి మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ, ఆయన సోదరుడు అశోక్ కి పోలీసులు సమన్లు జారీ చేశారని, వారిని విచారించిన తర్వాత మరికొందరినీ విచారణకు పిలిచే అవకాశం ఉందని చెబుతున్నారు. మొత్తానికి ఈ కేసు తమిళనాడు పొలిటికల్ సర్కిల్స్ లో హాట్ టాపిక్ అవుతోంది. పోలీసుల విచారణ జరుగుతున్న తీరు పలువురు నేతలకు టెన్షన్ కు గురిచేస్తోందని చెబుతున్నారు.

# బెంగళూరులో ఇల్లు దొరకడం కంటే స్వర్గానికి వెళ్లడం ఈజీ గురూ!



ఒకప్పుడు బెంగళూరు అంటే... చల్లని గాలులు, అందమైన పార్కులు, ఐటీ ఉద్యోగాలు, ఐస్క్రీమ్ పార్లర్లు. కానీ ఇప్పుడు? అద్దె కట్టలేక అల్లాడిపోవడం.. అడ్వాన్స్ ఇచ్చుకోలేక అప్పులపాలవ్వడం. అవును.. సిలికాన్ వ్యాలీ కాస్తా ఇప్పుడు 'రెంట్ వ్యాలీ'గా మారిపోయింది. సామాన్యుడు బెంగళూరులో అడుగుపెట్టాలంటేనే ప్యాంటు జేబులు గట్టిగా పట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చింది.

**ఆకాశంలో అద్దెలు... పాతాళంలో సామాన్యుడి జేబులు**

నగరంలో ఇల్లు వెతకడం అనేది ఇప్పుడు ఒక అడ్వెంచర్ స్పోర్ట్. ఎంతలా అంటే పెళ్లి సంబంధాల కంటే ఎక్కువగా ఇంటి ఓనర్లు అద్దెదారుల లింక్డ్‌ఇన్ ప్రొఫైళ్లు, టెన్త్ క్లాస్ మార్కులు, సీటీసీ ప్యాకేజీలు వెరిఫై చేస్తున్నారు. కళ్లముందు కనిపిస్తున్న రేట్లు చూస్తుంటే గుండె గుభేల్మనడం గ్యారెంటీ.. ఒక చిన్న సింగిల్ రూమ్ నెలకు రూ. 30,000.. ఇందులో బెడ్ వేస్తే మనుషులు నిలబడటానికి కూడా చోటుండదు. డబుల్ బెడ్‌రూమ్ 2 బీహెచ్.కే రూ. 40,000 నుంచి రూ. 50,000. అంటే నెలకు వచ్చే జీతంలో సగం ఓనరమ్మ చేతిలో పెట్టాల్సిందే. ఇండిపెండెంట్ విల్లాలు కావాలంటే రూ. 3 లక్షల నుంచి రూ. 4 లక్షలు. ఈ డబ్బుతో సొంత ఊర్లో ఒక ఇల్లే కొనేయొచ్చు..

**అడ్వాన్స్ భారం.. కిడ్నీలు అమ్ముకోవాల్సిందేనా?**

అద్దె ఒక ఎత్తయితే "సెక్యూరిటీ డిపాజిట్" మరో ఎత్తు. ప్రభుత్వం ఏమో "మూడు నెలల అద్దె కంటే ఎక్కువ తీసుకోకూడదు" అని రూల్స్ రాసి పుస్తకాల్లో దాచేసింది. కానీ ఓనర్లు మాత్రం "10 నెలల అడ్వాన్స్ కట్టాల్సిందే" అని భీష్మించుకు కూర్చుంటారు. "నెలకు రూ. 20 వేల అద్దె ఉన్న ఇంటికి రూ. 2 లక్షల అడ్వాన్స్ అడుగుతున్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరే కుర్రాడు అంత బడ్జెట్ తేవాలంటే... కిడ్నీలు ఏమైనా తాకట్టు పెట్టాలా?" అని ఐటీ యువత వాపోతోంది. "నచ్చితే ఉండు.. లేదంటే గేట్ దాటిపో" అనే ఓనర్ల డైలాగులు చూస్తుంటే... అద్దెకు ఉండేవాడు మనుషుడు కాదు.. కేవలం ఒక ఏటీఎం మిషన్ మాత్రమే అనిపిస్తోంది.

**ప్రభుత్వానికి వినతులు... సామాన్యుడి ఆశలు**

పరిస్థితి ఎంత దారుణంగా తయారైందంటే ఆర్టీఐ వర్కర్స్ సేవా సమితి అధ్యక్షుడు విజయ్ డెన్నిస్ ఏకంగా డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు వినతిపత్రం సమర్పించాల్సి వచ్చింది. "అయ్యా! ఓనర్ల అరాచకాలకు అడ్డుకట్ట వేయండి. ఒక ఆన్‌లైన్ పోర్టల్ పెట్టి ఈ అక్రమ వసూళ్లను ఆపండి" అని మొరపెట్టుకున్నారు. నిజమే మరి.. ఐటీ హబ్‌లైన హెచ్ఎస్ఆర్ లేఔట్, కోరమంగళ, వైట్‌ఫీల్డ్‌లలో తిరిగే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ప్యాకేజీలు లక్షల్లో తీసుకుంటున్నా... నెల చివరకు వచ్చేసరికి "అద్దె పోను మిగిలింది టీ తాగడానికి మాత్రమే" అంటూ కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

**'స్టార్టప్' దేశంలో 'రెంట్ అప్' గోల!**

స్టార్టప్‌లకు కేరాఫ్ అడ్రస్ అయిన బెంగళూరులో ఇప్పుడు "ఇల్లు ఎలా అద్దెకు తీసుకోవాలి?" అనే దానిపై ఒక కొత్త స్టార్టప్ పెట్టాల్సిన అవసరం వచ్చింది. ప్రభుత్వం ఈ 'రెంట్ మాఫియా'పై చర్యలు తీసుకుంటుందో లేదో కానీ అప్పటివరకు సామాన్యులు మాత్రం బెంగళూరు అందాలను చూడటానికి డబుల్ డెక్కర్ బస్సు ఎక్కినా... మనసులో మాత్రం "అద్దె భారం" గుబులు రేపుతూనే ఉంటుంది.

# బీజేపీ భజన.. విజయసాయిరెడ్డి ట్వీట్ కు అర్థమిదేనా?



రాజకీయాలకు గుడ్ బై చెప్పిన మాజీ ఎంపీ వి.విజయాసాయిరెడ్డి బీజేపీ భజన చేస్తున్నారంటూ కామెంట్లు వినిపిస్తున్నాయి. వైసీపీకి రాజీనామా చేసిన తర్వాత రాజకీయాలే చేయనంటూ విజయసాయిరెడ్డి గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఆయన అడపాదడపా రాజకీయ పరమైన ప్రకటనలు చేయడంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఉప ప్రధానిగా నియమించనున్నారనే వార్తలపై తాజాగా స్పందించిన విజయసాయిరెడ్డి ఆ వార్తలు నిజమైతే స్వాగతించాల్సిందేనంటూ ఎక్స్ లో ట్వీట్ చేశారు. దీనిపై కామెంట్లు చేస్తున్న నెటిజన్లు విజయసాయిరెడ్డి బీజేపీ భజన చేస్తున్నారా? అంటూ ప్రశ్నిస్తున్నారు.

రాజకీయాలే వద్దని ప్రకటించిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి బీజేపీతో స్నేహం కోరుకుంటున్నట్లు గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఆయన బీజేపీలో చేరాలని చూస్తున్నారని, కూటమిలోని టీడీపీ, జనసేన పార్టీలు అడ్డుకుంటున్నాయనే ఊహాగానాలు ఎక్కువగానే ఉన్నాయి. అయితే ఇవి నిజమో అబద్ధమో కానీ విజయసాయిరెడ్డి మాత్రం ఈ ప్రచారాన్ని అసలు పట్టించుకోనట్లే వ్యవహరిస్తున్నారు. అదే సమయంలో బీజేపీతో సన్నిహిత సంబంధాల కోసం ప్రయత్నిస్తున్నారనే అభిప్రాయానికి బలం చేకూర్చేలా నడుచుకుంటున్నారని అంటున్నారు. ఈ నేపథ్యంలో విజయసాయిరెడ్డి తాజాగా చేసిన ట్వీట్ కూడా హాట్ టాపిక్ అవుతోంది.

కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఉప ప్రధానిగా నియమించడాన్ని స్వాగతించాలని చెప్పడమే కాకుండా, అమిత్ షాను దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ తో పోల్చడం కూడా చర్చనీయాంశం అవుతోంది. రాజకీయ చతురుత, పరిపాలన సామర్థ్యం ఉన్న అమిత్ షా ఉప ప్రధాని బాధ్యతలు చేపట్టేందుకు పూర్తిగా అర్హులు అంటూ విజయసాయిరెడ్డి తన ట్వీట్ లో కొనియాడారు. అంతేకాకుండా ఒకప్పుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ నిర్వహించిన పదవిని చేపట్టడం కూడా సముచితమేనంటూ విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.

అయితే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యస్థీకరణ నేపథ్యంలో అమిత్ షా ఉప ప్రధాని కాబోతున్నారంటూ చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. దీనిపై ఇప్పటివరకు ఏ రాజకీయ నాయకుడు మాట్లాడలేదు. కానీ విజయసాయిరెడ్డి మాత్రం అమిత్ షా ఉప ప్రధాని అంటూ జరుగుతున్న ప్రచారం నిజం అవ్వాలని కోరుకోవడమే విశేషంగా చెబుతున్నారు. రాజకీయాలే వద్దని చెప్పిన విజయసాయిరెడ్డి బీజేపీ అగ్రనేతలకు దగ్గర అవ్వాలనే ఆలోచనతోనే ఈ ట్వీట్ చేసి ఉంటారని విశ్లేషిస్తున్నారు. ప్రధానంగా విజయసాయిరెడ్డి ఎదుర్కొంటున్న పలు కేసుల కారణంగా బీజేపీ పెద్దలతో సన్నిహిత సంబంధాలు నెరపాలనే ఆలోచనలో ఆయన ఉన్నారని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఏదిఏమైనా విజయసాయిరెడ్డి ట్వీట్ పొలిటికల్ సర్కిల్స్ లో విస్తృత చర్చనీయాంశంగా మారింది.

## సంపాదకీయం

### నిరాహార నినాదం!

పరీక్ష పత్రాల లీకేజీలపై కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రఖ్యాత శాస్త్రవేత్త, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష పదిహేడు రోజులు దాటింది. ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండటంతో దీక్ష విరమించాలని విపక్ష నేతలు సైతం విజ్ఞప్తి చేస్తున్న వేళ –ఈ దీక్ష ఒక మంత్రి రాజీనామాతో ముగిసిపోకూడదని, విద్యారంగ ప్రక్షాళనకు జాతీయ జాగృతిగా మారాలని వాంగ్‌చుక్ సతీమణి చేసిన విన్నపం దేశ మనస్సాక్షిని తట్టిలేపుతోంది. వ్యక్తులు తాత్కాలికం, వ్యవస్థలే శాశ్వతమన్నది ఆమె వాదన సారాంశం. బట్టీ విద్యకు పట్టంగట్టే పరీక్షల ప్రక్షాళన, కోచింగ్ సంస్కృతి నిర్మూలన, ఉపాధ్యాయ ఉత్కృష్టతా మిషన్, ఖాళీ పోస్టుల సత్వర భర్తీ, ప్రభుత్వ బడులపై విశ్వాస పునరుద్ధరణ, అకడమిక్ స్వేచ్ఛ, జాతీయ విద్యా డాష్‌బోర్డ్, జీడీపీలో ఆరు శాతం విద్యా వ్యయం, ఎన్నికల చక్రాలకు అతీతమైన చట్టబద్ధ సంస్కరణల కమిషన్ –ఈ పది సంస్కరణలను ఆమె జాతి ముందుంచారు.

ఢిల్లీ వీధుల్లో ఒక మహోన్నత వ్యక్తి శరీరం రోజురోజుకూ శుష్కిస్తోంది. కానీ ఆయన లేవనెత్తిన ప్రశ్న మాత్రం దేశ మనస్సాక్షిని తట్టిలేపుతూ మరింత బలపడుతోంది. ప్రఖ్యాత శాస్త్రవేత్త, విద్యావేత్త, సంఘ సంస్కర్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పరీక్ష పత్రాల లీకేజీల వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రారంభమైన దీక్ష కొనసాగుతుంటే.. ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. ఈ నేపథ్యంలో వాంగ్‌చుక్ సతీమణి చేసిన విన్నపం యావద్దేశాన్ని నిలదీస్తోంది. ఇది ఒక కుటుంబ వ్యక్తిగత వేదన కాదని, జాతి మనస్సాక్షికి పరీక్ష అని ఆమె స్పష్టం చేశారు. ఆమె మాటల్లోని సారం ఏమిటంటే –ఈ దీక్ష కేవలం ఒక మంత్రి రాజీనామాతో ముగిసిపోతే, ఒక అసాధారణ త్యాగాన్ని మామూలు రాజకీయ ఫలితంగా కుదించినట్లే! మంత్రులు వైఫల్యాలను అంగీకరించి తప్పుకునే నైతిక ధైర్యం ప్రదర్శించాల్సిందే. కానీ వ్యక్తులు తాత్కాలికం, వ్యవస్థలే శాశ్వతం. ఏ పార్టీ అధికారంలో ఉన్నా జవాబుదారీగా నిలిచేలా విద్యా భవిష్యత్తును నిర్వచించడమే అసలు అవసరం. పదిహేనేళ్ల క్రితం దేశ జనాభాలో సగంమంది 25 ఏళ్లలోపు వారే. దీన్ని 21వ శతాబ్దపు అపూర్వ అభివృద్ధి అవకాశంగా ఆర్థికవేత్తలు కీర్తించారు. కానీ విద్యలో ప్రవేశాలు పెరిగాయే తప్ప, అభ్యసనంలో పరివర్తన రాలేదు. మెరుగైన ఆలోచనాపరులు, వివేకవంతమైన నాయకులు, ఆవిష్కర్తలు, నైతిక వ్యాపారవేత్తలు, కరుణామయ పౌరులను తయారు చేసినప్పుడే జనసంఖ్యా లాభం సాకారమవుతుంది. అందుకే ఈ దీక్ష పార్టీలు, రాజకీయాలకు అతీతంగా విద్యా భవిష్యత్తుపై జాతీయ జాగృతికి ఉత్ప్రేరకం కావాలి.

ఆ జాగృతికి పునాదిగా పది తక్షణ సంస్కరణలను ఆమె దేశం ముందుంచారు. మొదటిది, పరీక్షా వ్యవస్థ ప్రక్షాళన. పరీక్షలు జ్ఞాపకశక్తికి పట్టంగడితే బడులు బట్టీ విద్యనే బోధిస్తాయి; ఆలోచనకు ప్రతిఫలమిస్తే ఆలోచనాపరులను తీర్చిదిద్దుతాయి. బోర్డు పరీక్షలనుంచి జేఈఈ, నీట్, యూపీఎస్సీ వరకు అన్నీ మూడేళ్లలోగా భావనల అవగాహన, సృజనాత్మకత, విశ్లేషణ, సమస్యా పరిష్కార సామర్థ్యాలను కొలిచేలా మారాలి. రెండోది, సమాంతర విద్యా వ్యవస్థగా అవతరించిన కోచింగ్ సంస్కృతి నిర్మూలన –బహుళ పరీక్షా అవకాశాలు, పాఠశాల ప్రతిభకు వెయిటేజీ ద్వారా అభ్యసనాన్ని బడులకు, బాల్యాన్ని పిల్లలకు తిరిగి అందించాలి. మూడోది, ప్రపంచ శ్రేష్ఠ ఉపాధ్యాయుల నిర్మాణం. ఏ విద్యా వ్యవస్థా తన ఉపాధ్యాయుల నాణ్యతను మించి ఎదగలేదన్నది ఫిన్లాండ్, సింగపూర్, జపాన్ అనుభవాలు చాటుతున్న సత్యం. నాలుగోది, అంగన్‌వాడీల నుంచి ఐఐటీల వరకు ప్రతి ఖాళీ పోస్టునూ మూడు నెలల్లోగా పారదర్శకంగా భర్తీ చేయడం. అయిదోది, ప్రతి డిగ్రీ విద్యార్థీ పట్టా పొందేలోగా అప్రెంటిస్‌షిప్, పరిశోధన, సామాజిక సేవవంటి వాటిలో ఒక సెమిస్టర్ పూర్తి చేయడం ద్వారా విద్యకు, సమాజానికి అనుసంధానం. ఆరోది, ప్రభుత్వ బడులపై విశ్వాస పునరుద్ధరణ. 13 ఏళ్ల వయసు వరకు ప్రతి బిడ్డకూ సమాన విద్య దక్కేలా మౌలిక వసతులు కనీస జాతీయ ప్రమాణాలుగా మారాలి. ఏడోది, విద్యా సంస్థలకు అకడమిక్ స్వేచ్ఛ. ప్రభుత్వాలు ఫలితాలను నిర్దేశించాలే తప్ప, బోధనలో మైక్రో మేనేజ్‌మెంట్ చేయకూడదు. ఎనిమిదోది, అభ్యసన ఫలితాలు, ఖాళీలు, ఉపాధి గణాంకాలను అందరూ పోల్చి చూడగల రియల్ టైమ్ జాతీయ విద్యా డాష్‌బోర్డ్. తొమ్మిదోది, విద్యపై ప్రజా వ్యయం జీడీపీలో కనీసం ఆరు శాతానికి, పరిశోధన నిధులు రెండు శాతానికి పెంపు. అన్నింటికంటే కీలకమైన పదోది –ప్రభుత్వాలు మారినప్పుడల్లా సంస్కరణలు మొదటికి రాకుండా, జాతీయ ప్రమాణాలను నిర్దేశించి, అమలును ఆడిట్ చేసి, ఫలితాలకు ప్రభుత్వాలను జవాబుదారీ చేసే స్వతంత్ర చట్టబద్ధ జాతీయ విద్యా సంస్కరణల కమిషన్ ఏర్పాటు.

నిజానికి ఈ పది సూత్రాల్లో ఏ ఒక్కటీ అసాధ్యమైనది కాదు; కావాల్సింది రాజకీయ సంకల్పమే. ప్రతి ప్రభుత్వమూ విద్యకు ఎంతోకొంత తోడ్పాటు అందించినా, పరిష్కారం కాని నిర్మాణాత్మక బలహీనతలను వారసత్వంగా పొందిందన్నదీ వాస్తవమే. అందుకే విద్య భారతదేశపు తొలి నిజమైన పక్షాతీత జాతీయ మిషన్‌గా అవతరించాలి. చరిత్ర ఏ జాతికైనా అందించే నిర్ణాయక ఘడియలు అరుదు.. ప్రజల దృష్టి, నైతిక సంకల్పం, రాజకీయ ఆవశ్యకత ఒక్కచోట కలిసే క్షణాలవి. వాంగ్‌చుక్ దీక్ష అటువంటి ఘడియను దేశం ముంగిట నిలిపింది. గాంధీజీ ఉపవాస దీక్షలు బ్రిటిష్ సామ్రాజ్యాన్నే కదిలించిన చరిత్ర మనది. మరి స్వతంత్ర భారతంలో ఒక విద్యావేత్త ప్రాణాలను పణంగాపెట్టి లేవనెత్తిన ప్రశ్నకు వ్యవస్థ ఇచ్చే సమాధానమేమిటి? పార్లమెంటు సమావేశాలు ఎప్పటిలాగే ముగుస్తాయి. కానీ ఈ ఏడాది ఒకటో తరగతిలో అడుగుపెడుతున్న చిన్నారి రేపు ఆవిష్కర్తగా ఎదుగుతాడా? అనుకరణదారుగా మిగులుతాడా? అన్నది నేడు మనం నిర్మించే విద్యపైనే ఆధారపడి ఉంటుంది. దేశం ముందున్న ప్రశ్న విద్యాశాఖను ఎవరు నడిపిస్తారన్నది కాదు; మన పిల్లలకు తగిన విద్యా వ్యవస్థను నిర్మించే దార్శనికత, సంకల్పం మనకున్నాయా అన్నదే. ఆ బాధ్యత ఏ ఒక్క ప్రభుత్వానిదో కాదు –విద్యే సకల జాతీయ ఆకాంక్షలకు పునాది అని నమ్మే ప్రతి పౌరుడిదీ. వాంగ్‌చుక్ దీక్ష ఆ ప్రస్థానానికి నాంది పలికితే, ఆయన త్యాగం ఒక జాతిని జాగృతం చేసిన చారిత్రక ఘట్టంగా నిలుస్తుంది. సంస్కరణ, పునరుద్ధరణ, పునరుజ్జీవనం –ఈ మూడింటి సమాహారమే నేటి భారత విద్యారంగానికి కావాల్సిన సంజీవని!

---

## పనికొచ్చే పలుకు



### కోపం ఖరీదు.. సంతోషం!

"నువ్వు కోపంగా గడిపే ప్రతి నిమిషం, నీ జీవితంలోని అరవై సెకన్ల సంతోషాన్ని కోల్పోతున్నట్లే" –ప్రఖ్యాత అమెరికన్ తత్వవేత్త రాల్ఫ్ వాల్డో ఎమర్సన్ మాట ఇది. నేటి ఆధునిక జీవనశైలికి అద్దంపట్టే హెచ్చరిక కూడా. జీవితమనేది ఎవరికైనా పరిమిత కాలమే. దాన్ని దేనితో నింపుతున్నామన్నదే అసలు ప్రశ్న. కోపానికి కేటాయించే ప్రతి క్షణమూ, సంతోషం ఖాతానుంచి చేసే ఖర్చే. ఆ లెక్క ఎప్పటికీ తిరిగి రాదు. కాలానికి రీఫండ్ ఉండదుగా.

మోడ్రన్ లైఫ్‌స్టయిల్‌లో కోపానికి కారణాలు అడుగడుగునా. ఉదయం లేవగానే ట్రాఫిక్ చిరాకు. ఆఫీసులో డెడ్‌లైన్ల ఒత్తిడి. బాస్ మాటలు, సహోద్యోగుల పోలికలు. ఇంటికొచ్చాక కుటుంబ బాధ్యతల భారం. ఇవి చాలవన్నట్లు –సోషల్ మీడియా తెరిస్తే చాలు, ఎవడో రాసిన కామెంట్, ఎవరిదో విజయాన్ని చూసి కలిగే అసహనం, రాజకీయ వాదనలు, ట్రోలింగ్‌లు.. ఇలా అరచేతిలోని ఫోనే ఆగ్రహానికి అగ్గిపెట్టెగా మారింది. నిమిషానికోసారి నోటిఫికేషన్లతో మెదడును ఉద్రేకపరిచే ఈ డిజిటల్ యుగంలో, ప్రశాంతత అనేది అరుదైన సంపదగా మారిపోయింది.

ఇక్కడ గమనించాల్సిన సూక్ష్మం ఒకటుంది. కోపం వచ్చినప్పుడు మనం శిక్షించేది ఎదుటివారిని కాదు.. మనల్ని మనమే! ట్రాఫిక్‌లో హారన్ మోగించి అరిచినంత మాత్రాన రోడ్డు ఖాళీ కాదు. కానీ మన రక్తపోటు మాత్రం సర్రున పెరుగుతుంది. ఆధునిక వైద్యశాస్త్రం కూడా ఇదే చెబుతోంది –నిరంతర ఆగ్రహం గుండె జబ్బులకు, నిద్రలేమికి, మానసిక ఆందోళనకు నేరుగా దారితీస్తుందని. అంటే కోపంవల్ల పోయేది సంతోషం మాత్రమే కాదు.. ఆరోగ్యం, ఆయుష్షు కూడా! "కోపం తెచ్చుకోవడమంటే –ఎదుటివాడు చేసిన తప్పుకు మనల్ని మనం శిక్షించుకోవడమే" అన్న పెద్దల మాటలోని ఆంతర్యమిదే.

మరో కోణం చూద్దాం. కోపంలో గడిపిన క్షణాల్లో మనం ఏం కోల్పోతున్నామో ఎప్పుడైనా ఆలోచించారా? పిల్లల నవ్వులు వినే క్షణాలు.. అమ్మ చేతి భోజనాన్ని ఆస్వాదించే తీరిక.. స్నేహితుడితో మనసారా మాట్లాడే సమయం.. సాయంత్రపు సూర్యాస్తమయాన్ని చూసే ఓపిక –ఇవన్నీ కోపమే మింగేస్తుంది. ఒక చిన్న వాట్సాప్ గొడవ మనసులో ఉంటే, ఎదురుగా ఉన్న అందమైన జీవితమంతా అంధకారమే. కోపమనే నల్ల కళ్లద్దాలు పెట్టుకుంటే, ప్రపంచమంతా చీకటే. అలాగని కోపమే రాకూడదని కాదు. అది సహజమైన భావోద్వేగం. కానీ అది వచ్చినప్పుడు దాన్ని ఎంతసేపు మోస్తున్నామన్నదే కీలకం! నిప్పు కణిక చేతిలో పడితే వెంటనే విదిలించేస్తాం. మరి కోపాన్ని మాత్రం గంటలు, రోజులు, కొన్నిసార్లు ఏళ్ల తరబడి గుండెల్లో మోస్తూ తిరుగుతామెందుకు? అందుకే మానసిక నిపుణులు కొన్ని చిన్న సూత్రాలు చెబుతారు. కోపం వచ్చినప్పుడు వెంటనే స్పందించకుండా పది లోతైన శ్వాసలు తీసుకోవడం, ఆ క్షణంలో ఫోన్ పక్కన పెట్టడం, నడకకు వెళ్లడం, "ఈ విషయం పదేళ్ల తర్వాత కూడా ఇంత ముఖ్యమేనా?" అని ప్రశ్నించుకోవడం –ఇవి సాధన చేస్తే ఆగ్రహం మీద అదుపు అలవడుతుంది. క్షమించడమంటే ఎదుటివారికి ఇచ్చే బహుమతి కాదు.. మనకు మనం ఇచ్చుకునే విముక్తి!

చివరగా ఒక్క మాట. జీవిత గడియారంలో ప్రతి సెకనూ ముందుకే కదులుతుంది, వెనక్కి కాదు. ఆ సెకన్లను కోపంతో నింపుతామా, సంతోషంతో నింపుతామా అన్నది పూర్తిగా మన చేతుల్లోని ఎంపిక. కోపం క్షణికం.. దానివల్ల కోల్పోయే ఆనందం శాశ్వతం. అందుకే ఆగ్రహం తలుపు తట్టినప్పుడల్లా ఎమర్సన్ మాటను గుర్తు చేసుకుందాం –ఈ నిమిషం కోపానికా, సంతోషానికా? ఎంపిక సరైనదైతే, జీవితమే ఒక పండుగ!

---

# నడినెత్తిన ఎల్‌నినో నీలినీడలు



తెలుగు రాష్ట్రాల నెత్తిన ఎల్‌నినో నీలినీడలు కమ్ముకుంటున్నాయి. జూన్‌లో సకాలంలోనే పలకరించిన నైరుతి రుతుపవనాలు.. తర్వాత ముఖం చాటేయడంతో, ఏపీ, తెలంగాణ రెండూ వర్షాభావ సంక్షోభం అంచున నిలిచాయి. జులై 16నాటికి తెలంగాణలో 35 శాతం వర్షపాతం లోటు నమోదవగా, రాష్ట్రంలోని 33 జిల్లాలకుగాను ఏకంగా 27 జిల్లాలు లోటు వర్షపాతంతో అల్లాడుతున్నాయి. సాధారణంగా ఈపాటికి 243.4 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, కేవలం 159.1 మిల్లీమీటర్లే నమోదైంది. ఆంధ్రప్రదేశ్ పరిస్థితీ ఆందోళనకరమే. రాష్ట్రంలో ఇప్పటివరకు 25 శాతం వర్షపాతం లోటు నమోదవగా, పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతున్నాయి. జలాశయాల దుస్థితి మరింత ఆందోళన రేపుతోంది. గోదావరి బేసిన్ ప్రాజెక్టుల్లో వినియోగార్హ నిల్వ 27.69 టీఎంసీకి, కృష్ణా బేసిన్‌లో 14.81 టీఎంసీకి పడిపోయింది. అందుబాటులో ఉన్న నీరు ప్రధానంగా తాగునీటి అవసరాలకే సరిపోతుందని, భారీ వరద వస్తే తప్ప సాగునీటి విడుదలకు ఆస్కారం లేదని అధికారులు చెబుతున్నారు. భూగర్భ జలాలదీ అదే దారి –గత ఏడాదితో పోలిస్తే జూన్‌లోనే 18 జిల్లాల్లో సగటు భూగర్భ జలమట్టాలు క్షీణించాయి. ఈ ప్రమాద సంకేతాలను గుర్తించిన ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయన్నది సానుకూలాంశం. కరవు పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ మంత్రివర్గం ఖరీఫ్ సీజన్‌కు వ్యవసాయ ఆకస్మిక ప్రణాళిక సిద్ధం చేస్తోంది. తక్కువ నీరు అవసరమయ్యే పంటలవైపు రైతులను మళ్లించడం, స్వల్పకాలిక, కరవు తట్టుకునే వంగడాలను ప్రోత్సహించడం, పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల సాగును విస్తరించడం, జిల్లాలవారీ ప్రత్యామ్నాయ పంట సిఫార్సులు, ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించే యాజమాన్య పద్ధతులు ఇందులో భాగం కానున్నాయి. తాగునీటికి ఎలాంటి ఇబ్బందీ రాకుండా స్థానిక వనరుల ఆధారంగా అన్ని నివాస ప్రాంతాలకు నీటి సరఫరా వ్యవస్థలను సన్నద్ధం చేస్తున్నారు. బలహీన ప్రాంతాల్లో భూగర్భజల ఆధారిత పథకాల వినియోగంపై కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సైతం జలవనరుల పరిరక్షణ, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, రైతు భరోసా చర్యలపై దృష్టి సారించింది. కేంద్ర స్థాయిలో –తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లోని 315 జిల్లాల్లో కరవు ఆకస్మిక ప్రణాళికలను కేంద్ర ప్రభుత్వం క్రియాశీలం చేసింది. సంక్షోభం తలుపు తట్టకముందే సన్నద్ధత ప్రారంభం కావడం ముదావహమే అయినా, ప్రణాళికలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో వేగంగా అమలు కావడమే అసలు పరీక్ష.

ఈ సంక్షోభం వెనుక ఉన్న శాస్త్రీయ వాస్తవాలను అర్థం చేసుకుంటేనే సమస్య తీవ్రత బోధపడుతుంది. ప్రతి రెండు నుంచి ఏడేళ్లకోసారి పసిఫిక్ మహాసముద్రంలో సంభవించే ఎల్‌నినో, ప్రపంచవ్యాప్తంగా భారీ వర్షాలు, కరవులు, ఉష్ణ ప్రకోపాలను ప్రేరేపిస్తుంది. ఈ ఏడాది మిగిలిన కాలంలో ఎల్‌నినో ప్రభావం 90 శాతం వరకు కొనసాగే అవకాశం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థ అంచనా. సాధారణ పరిస్థితుల్లో వ్యాపార పవనాలు వెచ్చని సముద్ర జలాలను పశ్చిమ పసిఫిక్‌వైపు నెడతాయి. ఎల్‌నినో బలపడినప్పుడు ఆ పవనాలు బలహీనపడటమో, వెనక్కి మళ్లడమో జరిగి, వేడినీరు అమెరికా ఖండాలవైపు ప్రవహిస్తుంది. మధ్య, తూర్పు పసిఫిక్ ఉపరితల ఉష్ణోగ్రతలు సగటు కంటే రెండు డిగ్రీలకు మించి పెరిగితే దాన్ని 'సూపర్' స్థాయిగా పరిగణిస్తారు. ఇది భారత నైరుతి రుతుపవనాలను బలహీనపరుస్తుంది. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా ఈ ఏడాది దేశంలో రుతుపవన వర్షపాతం దీర్ఘకాలిక సగటులో 90 శాతమే ఉంటుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. దేశ వార్షిక వర్షపాతంలో 70 శాతం రుతుపవనాల నుంచే లభిస్తుంది. సగం సాగుభూమికి నీటిపారుదల సదుపాయం లేని, జనాభాలో సగంమంది వ్యవసాయంపైనే ఆధారపడిన మన దేశానికి ఇది ఎంత కీలకమో వేరే చెప్పనక్కర్లేదు. ఇక్కడ మరో సూక్ష్మం ఉంది –హిందూ మహాసముద్ర ద్విధ్రువత (ఐవోడీ) సానుకూలంగా ఉంటే తేమ గాలులను భారత ఉపఖండం వైపు లాగి రుతుపవనాలకు ఊతమిస్తుంది. కానీ ఎల్‌నినో సాధారణంగా ఐవోడీ కంటే శక్తిమంతమైనది కావడంతో, దాని ప్రతికూలతను ఐవోడీ పాక్షికంగానే సరిదిద్దగలదు. అసలే మానవ కార్యకలాపాలతో కర్బన ఉద్గారాలు కట్టుతప్పి భూగోళం వేడెక్కుతున్న వేళ, సముద్రం నుంచి వాతావరణానికి ఉష్ణశక్తిని భారీగా బదిలీ చేసే ఎల్‌నినో ఆ మంటకు ఆజ్యం పోస్తోంది. 2023–24 నాటి ఎల్‌నినో ధాటికి పారిస్ ఒప్పంద పరిమితి అయిన 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్‌ను దాటిన తొలి సంవత్సరంగా 2024 నిలిచింది. ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో 2027లో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఐరోపాను కుదిపేస్తున్న వడగాడ్పులు ఇప్పటికే 1,300 మందికి పైగా ప్రాణాలను బలిగొనడం ఆ హెచ్చరికల తీవ్రతకు తార్కాణం. ఆర్థిక కోణంలోనూ ఎల్‌నినో దెబ్బ చిన్నది కాదు. ఆహార ధాన్యాల ప్రధాన ఎగుమతి ప్రాంతాల్లో కరవులను ప్రేరేపించి, పంట దిగుబడులను తగ్గించి, వ్యవసాయ సరఫరా గొలుసులను ఛిన్నాభిన్నం చేసి ఆహార ద్రవ్యోల్బణాన్ని ఎగదోస్తుంది. బలహీన రుతుపవన అంచనాల నేపథ్యంలో భారత జీడీపీ వృద్ధి రేటు 7.7 శాతంనుంచి 6.6 శాతానికి తగ్గవచ్చని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ అంచనా వేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. వర్షాలు మురిపిస్తేనే పల్లె పులకరిస్తుంది, దేశ ఆర్థిక రథం పరుగులు తీస్తుంది. వాన కరవైతే ఆ ప్రభావం పొలం గట్టు నుంచి స్టాక్ మార్కెట్ దాకా ప్రతిచోటా ప్రతిధ్వనిస్తుంది.

విపత్తు ముంగిట ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరిస్తే నష్టాన్ని గణనీయంగా నివారించొచ్చు. ప్రణాళికలతోపాటు అమలులో వేగం, పారదర్శకత అత్యవసరం. కరవును తట్టుకునే స్వల్పకాలిక విత్తనాలను రైతులకు సకాలంలో, సబ్సిడీపై అందుబాటులో ఉంచాలి. బోరుబావులపై ఒత్తిడి పెరగకుండా బిందు, తుంపర సేద్యం వంటి సూక్ష్మ నీటిపారుదల విధానాలను యుద్ధప్రాతిపదికన విస్తరించాలి. చెరువులు, కుంటల పూడికతీత, వాననీటి సంరక్షణ పనులను ఉపాధి హామీ పథకంతో అనుసంధానించి గ్రామీణ కూలీలకు పని కల్పించడంతోపాటు జల సంరక్షణనూ సాధించాలి. పంటల బీమా పరిహారం సకాలంలో అందేలా యంత్రాంగాన్ని సన్నద్ధం చేయాలి. పశుగ్రాసం, తాగునీటి ట్యాంకర్ల ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలి. వాతావరణ ముందస్తు హెచ్చరికలను గ్రామస్థాయి రైతుల చెంతకు చేర్చే డిజిటల్ వ్యవస్థలను బలోపేతం చేయాలి. కృష్ణా, గోదావరి జలాల విషయంలో రెండు తెలుగు రాష్ట్రాలూ వివాదాలను పక్కనపెట్టి, అందుబాటులో ఉన్న ప్రతి నీటిబొట్టునూ సమన్వయంతో వాడుకోవడం ఈ క్లిష్ట సమయంలో అత్యంత కీలకం. ఎల్‌నినో వంటి ప్రకృతి వైపరీత్యాలను మనం ఆపలేకపోవచ్చు. కానీ దుష్ప్రభావాన్ని తగ్గించడం ఖచ్చితంగా మన చేతుల్లోనే ఉంది. ఆధునిక విజ్ఞానం వాన రాకడను ముందే పసిగట్టే శక్తిని మనకు అందించింది. ఆ హెచ్చరికలను పాలకులు ఎంత చిత్తశుద్ధితో కార్యాచరణగా మలుస్తారన్న దానిపైనే కోట్లాది రైతన్నల భవితవ్యం ఆధారపడి ఉంది. వరుణుడు పెట్టిన ఈ పరీక్షలో తెలుగు రాష్ట్రాలు నెగ్గాలంటే –ముందుచూపు, సమన్వయం, వేగవంతమైన అమలు అనే మూడు అస్త్రాలే శరణ్యం! ■

---



జీవితంలో చాలా విషయాలు నేర్చుకోవడం సులభమే కానీ, వాటిలో నైపుణ్యం సాధించడమే కష్టం. ఆ నైపుణ్యానికి అడ్డుకట్ట వేసేది జ్ఞాన లోపం కాదు. పనితనం, పట్టుదల లోపించడం. ప్రతిభావంతులకు ఏం చేయాలో బాగా తెలిసినా.. ఆ పనిని సరిగ్గా చేయరు, లేదా కొన్నాళ్లు చేసి మధ్యలోనే వదిలేస్తుంటారు. నిరంతర సాధన మాత్రమే మిమ్మల్ని అందరి కంటే ఉత్తములుగా మారుస్తుంది.

*నీటి బొట్టు బండరాయిని చీల్చేది బలంతో కాదు..*
*నిరంతరాయంగా పడటం వల్లే. అలుపెరగని అభ్యాసమే..*
*అసాధ్యాన్ని సుసాధ్యం చేసే అస్త్రం.*

–మహాదేవ

---

## వింతల్లో వింతలు

### దోమల వేటకూ డ్రోన్లు!



దోమల బెడదనుంచి విముక్తికి అమెరికా స్టార్టప్ ఒకటి వినూత్న పరిష్కారం కనుగొంది. వై కాంబినేటర్ మద్దతున్న 'టోర్నియోల్' అనే స్టార్టప్ ఇంజినీర్లు, ఏఐ సాయంతో పనిచేసే మైక్రో డ్రోన్లను అభివృద్ధి చేస్తున్నారు. గాల్లో ఎగురుతున్న దోమలను గుర్తించి, అక్కడికక్కడే కూల్చేయడం వీటి ప్రత్యేకత. రసాయనాలతో పోలిస్తే దోమల నిర్మూలన ఖర్చును ఇవి వంద రెట్లు తగ్గిస్తాయని సంస్థ చెబుతోంది. తాజాగా సంస్థ వ్యవస్థాపకుడు అలెక్స్ టౌసెంట్ ఓ వీడియోను విడుదల చేశారు. అందులో చిన్న డ్రోన్ ఒక చిమ్మటను వెంటాడి మరీ కూల్చేసింది. దీన్ని తమ తొలి "ఎయిర్–టు–ఎయిర్ కిల్"గా ఆయన అభివర్ణించారు. కేవలం 40 గ్రాముల బరువుండే ఈ డ్రోన్లు అల్ట్రాసోనిక్ సెన్సర్లు, మైక్రోఫోన్ల ద్వారా దోమ రెక్కల ప్రత్యేక శబ్దాన్ని పసిగట్టి, ఇతర కీటకాల నుంచి వాటిని వేరు చేయగలవు. కేవలం పది డ్రోన్లతో ఒక చదరపు కిలోమీటర్ ప్రాంతాన్ని దోమల రహితంగా మార్చాలన్నది సంస్థ లక్ష్యం. ప్రయోగాలు విజయవంతమైతే, నగరాల్లో దోమల యుద్ధానికి ఇక డ్రోన్ సైన్యమే సమాధానం కానుంది!

**మనం వాడే వస్తువైనా, ధరించే దుస్తులైనా.. మన శరీరానికి సౌకర్యాన్నిచ్చినప్పుడే.. మనసూ ప్రశాంతంగా ఉంటుంది. ఇంటీరియర్‌కూ ఈ సూత్రం వర్తిస్తుందంటున్నారు నిపుణులు. నచ్చిన ఫర్నిచర్‌తో ఇంటిని అలంకరించుకుంటే.. సౌకర్యవంతంగానే కాదు.. మనసుకూ ఎంత సంతోషంగా ఉంటుందో మాటల్లో చెప్పలేం! పైగా ఎంత సేపైనా అక్కడే ఉండాలనిపిస్తుంది.**

# మూడ్ మార్చేసే ఇంటీరియర్ డిజైనింగ్!



మనం వాడే వస్తువైనా, ధరించే దుస్తులైనా.. మన శరీరానికి సౌకర్యాన్నిచ్చినప్పుడే.. మనసూ ప్రశాంతంగా ఉంటుంది. ఇంటీరియర్‌కూ ఈ సూత్రం వర్తిస్తుందంటున్నారు నిపుణులు. నచ్చిన ఫర్నిచర్‌తో ఇంటిని అలంకరించుకుంటే.. సౌకర్యవంతంగానే కాదు.. మనసుకూ ఎంత సంతోషంగా ఉంటుందో మాటల్లో చెప్పలేం! పైగా ఎంతసేపైనా అక్కడే ఉండాలనిపిస్తుంది. ఇదే పరోక్షంగా మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేస్తుందట! అందుకే నచ్చినట్లుగా ఇంటిని అలంకరించుకుంటే.. రోజువారీ ఒత్తిళ్లు, ఆందోళనలు దూరమై హ్యాపీగా ఉండచ్చని పలు అధ్యయనాలూ చెబుతున్నాయి. మరి, ఇంటీరియర్ డిజైనింగ్ మానసిక ఆరోగ్యంపై ఎలాంటి సానుకూల ప్రభావం చూపుతుందో తెలుసుకుందాం రండి..

### గదిని బట్టి.. రంగులు!

ఇంటి అందాన్ని పెంచడంలో, మనసుకు ఆహ్లాదాన్ని అందించడంలో రంగులది కీలక పాత్ర! నచ్చిన రంగుల్ని ఎంచుకుంటే.. అటు సౌకర్యంగా, ఇటు ప్రశాంతంగా అనిపిస్తుంది. ఈ క్రమంలోనే శరీరంలో డోపమైన్ అనే హ్యాపీ హార్మోన్ విడుదలవుతుంది. తద్వారా సంతోషంగా ఉండగలుగుతాం. అయితే మనకు నచ్చిన రంగుల్ని ఎంచుకుంటే సరిపోదు.. గది అవసరాల్నీ పరిగణనలోకి తీసుకోవాలంటున్నారు నిపుణులు. ఉదాహరణకు.. పడకగదిలో రిలాక్సవుతాం.. కాబట్టి ఇక్కడ మనసుకు ప్రశాంతతను అందించే లేత రంగులు, అందులోనూ ముఖ్యంగా పేస్టల్ షేడ్స్‌ని ఎంచుకోవడం మంచిదంటున్నారు. అదే కిచెన్‌లో పనిచేసే సమయంలో ఉత్సాహంగా, చురుగ్గా ఉంటేనే పనులు సమయానికి పూర్తవుతాయి. కాబట్టి ఈ గదికి ఎరుపు, ఆరెంజ్.. వంటి రంగులు నప్పుతాయంటున్నారు. ఇలా గది ప్రత్యేకతల్ని బట్టి రంగుల్ని ఎంచుకుంటే.. అది ఆటోమేటిక్‌గా మనసుపై సానుకూల ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు.





### 'బయోఫిలిక్ డిజైన్' తెలుసా?

ఇంటి అలంకరణ విషయంలో ఒక్కొక్కరికీ ఒక్కో అభిరుచి ఉంటుంది. కొందరు తమ ఇల్లు మోడ్రన్‌గా ఉండాలని కోరుకుంటే.. మరికొందరు వింటేజ్ థీమ్‌ని ఎంచుకుంటుంటారు. అయితే ఎవరి ఇష్టాయిష్టాలెలా ఉన్నా.. బయోఫిలిక్ ఇంటీరియర్ ట్రెండ్ మాత్రం ఇటు ఆరోగ్యాన్నిస్తూనే, అటు మానసిక ప్రశాంతతను, సౌకర్యాన్ని సొంతం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇందుకు కారణం.. ఈ డిజైనింగ్ కోసం వాడే అలంకరణ వస్తువులన్నీ పర్యావరణహితమైన ఉత్పత్తులతో తయారుచేయడమే! చెక్క, మట్టి, ఓక్ చెట్టు బెరడు, రాటెన్ (ఇదో రకమైన కలప), ఉన్ని.. వంటి ప్రకృతి అందించే మెటీరియల్స్‌ని ఈ వస్తువుల తయారీలో ఉపయోగిస్తుంటారు డిజైనర్లు. బయోఫిలిక్ ఇంటీరియర్‌లో భాగంగా ఇలా గృహాలంకరణ వస్తువులే కాదు.. ఇంట్లోనే గోడకు లేదంటే ఓ మూలన చిన్నపాటి గార్డెన్‌లా పచ్చదనాన్ని ఏర్పాటుచేసుకోవడం, ప్రకృతి రమణీయతతో కూడిన ఆర్ట్‌వర్క్‌కి ఇంట్లో చోటివ్వడం.. వంటివీ దీని కిందకే వస్తాయి. ఈ తరహా ఫర్నిచర్/గృహాలంకరణ వస్తువులతో మానసిక ఒత్తిళ్లు, ఆందోళనలు తగ్గి.. ప్రశాంతత చేకూరుతుందని పలు అధ్యయనాల్లోనూ తేలింది.



### వెలుతురు..ఓఎక్కడెలా?

వెలుతురు కూడా మన మనసును ప్రభావితం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందులోనూ సహజసిద్ధమైన లైటింగ్ కీలక పాత్ర పోషిస్తుందట! అయితే చాలామంది వేడిగా ఉందని, దుమ్ము వస్తుందని.. పగటి పూటే తలుపులు, కిటికీలు మూసేసి.. వెలుతురు కోసం లోపలి లైట్లను ఉపయోగిస్తుంటారు. కానీ పగటి పూట వచ్చే న్యాచురల్ లైటింగ్‌ని ఇలా అడ్డుకోకుండా పూర్తిగా ఆస్వాదించినప్పుడే మనసుకు సాంత్వన చేకూరుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే పగటి పూట తలుపులు, కిటికీలు తీసే ఉంచడం మంచిది. అవసరమైతే వాటికి పల్చటి కర్టెన్లు వేలాడదీస్తే.. వేడి, దుమ్ము బెడద లేకుండా ఉంటుంది.. ఇంట్లో వెలుతురు కూడా పడుతుంది. ఇక రాత్రి పూట ఇంట్లో ఉపయోగించే లైటింగ్ కూడా గది అవసరాల్ని బట్టి ఉండాలంటున్నారు నిపుణులు. లివింగ్ రూమ్‌లో ఎక్కువ సమయం గడుపుతుంటాం కాబట్టి ఈ గదిలో ప్రకాశవంతమైన లైట్లను ఏర్పాటుచేసుకోవాలి. ఇక గోడలపై ఏర్పాటుచేసిన ఫొటో ఫ్రేములు, ఆర్ట్ వర్క్‌పై మినీ స్పాట్ లైట్లను ఏర్పాటుచేసుకుంటే గదికి అందమొస్తుంది.. మనసుకు ఆహ్లాదంగానూ అనిపిస్తుంది. అదే పడకగదిలో లైటింగ్ ఎంత తక్కువగా ఉంటే మనసుకు అంత ప్రశాంతంగా ఉంటుందంటున్నారు నిపుణులు. పుస్తకాలు చదువుకోవడానికి, వర్క్ చేసుకోవడానికి టేబుల్ ల్యాంప్స్‌ని ఉపయోగించచ్చు. ఇక డైనింగ్ టేబుల్‌పై షాండ్లియర్/పెండెంట్ లైటింగ్ ఏర్పాటుచేసుకుంటే.. ఆ గదికి ఆ లైటింగ్ సరిపోతుంది. లైట్ల ఫోకస్ ఎక్కువగా లేకుండా ప్రశాంతమైన భావన కలుగుతుంది.

ఇక కిచెన్‌లోనూ లైటింగ్ ప్రకాశవంతంగా ఉండాల్సిందే! అయితే దీంతో పాటు క్యాబినెట్స్, అరల్లో స్పాట్ లైట్లను ఏర్పాటుచేసుకుంటే.. అక్కడి వస్తువులు సులభంగా వాడుకోవడానికి వీలుగా ఉంటుంది.. కంఫర్టబుల్‌గానూ అనిపిస్తుంది. ఇది పరోక్షంగా మానసిక ప్రశాంతతనూ పెంచుతుంది.

### గోడలకు.. 'డోపమైన్' టచ్!

ఇంటి అలంకరణ అనగానే చాలామంది గోడల పైనే తమ దృష్టి కేంద్రీకరిస్తారు. తమకు నచ్చిన చిత్రాల్ని గోడలకు తగిలించడం లేదంటే చక్కటి వాల్ ఆర్ట్ వేయించుకోవడం, వాల్‌పేపర్‌ని అతికించుకోవడం.. ఇలా ఎవరి స్టైల్ వారిది! అయితే అందులోనూ 'అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్ (వాస్తవికతకు సంబంధం లేకుండా గీసే చిత్రకళ)', 'పర్సనలైజ్‌డ్ ఆర్ట్ (వ్యక్తిగత అభిరుచులు, జ్ఞాపకాలతో చిత్రాల్ని రూపొందించడం)'.. వంటివి మనసుకు ఎక్కువ సంతోషాన్ని, ప్రశాంతతను అందిస్తాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే వీటిని 'డోపమైన్ డెకార్'గా నిపుణులు పేర్కొంటున్నారు. కాబట్టి ఇలాంటి అలంకరణ వస్తువులతో గోడలకు హంగులద్దితే ఇటు ఇంటికి అందం తీసుకురావచ్చు.. అటు మనసునూ ప్రశాంతంగా ఉంచుకోవచ్చు అంటున్నారు నిపుణులు.

# వరల్డ్ కప్ ఫైనల్‌కు రెఫరీగా విన్సిచ్.. అర్జెంటీనాకు పాత భయాలు.. మెస్సీ అభిమానుల్లో టెన్షన్!

**2026 ప్రపంచకప్ ఫైనల్‌కు రెఫరీగా స్లోవేనియాకు చెందిన స్లావ్కో విన్సిచ్**

**2022లో విన్సిచ్ రెఫరీయింగ్‌లోనే సౌదీ చేతిలో అర్జెంటీనా ఓటమి**

**తాజా నియామకంతో అర్జెంటీనా అభిమానుల్లో నెలకొన్న ఆందోళన**

**స్పెయిన్ ఆడిన కీలక మ్యాచ్‌లలో విన్సిచ్ రెఫరీగా వ్యవహరించి సానుకూల ఫలితాలు**

**ఫైనల్‌లో విన్సిచ్ ప్రతి నిర్ణయంపై తీవ్ర ఒత్తిడి ఉండే అవకాశం**




**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ సమరానికి రంగం సిద్ధమైంది. న్యూయార్క్ వేదికగా ఆదివారం అర్జెంటీనా, స్పెయిన్ జట్ల మధ్య జరిగే ఈ టైటిల్ పోరుకు స్లోవేనియాకు చెందిన ప్రముఖ రెఫరీ స్లావ్కో విన్సిచ్‌ను ఫిఫా నియమించింది. ఈ వార్త ఫుట్‌బాల్ ప్రపంచంలో సంతోషం నింపినప్పటికీ, అర్జెంటీనా అభిమానుల్లో మాత్రం తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. దీనికి కారణం విన్సిచ్ రెఫరీయింగ్‌లో అర్జెంటీనాకు ఉన్న ఒక చేదు గతం. ఈ ప్రతిష్ఠాత్మక మ్యాచ్‌కు తనను ఎంపిక చేసినట్లు తెలియగానే, రెఫరీ కిట్ అందుకుంటూ విన్సిచ్ భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అతనికి సహాయకులుగా తోమాజ్ క్లాంక్నిక్, ఆంద్రాజ్ కోవాసిచ్ (ఇద్దరూ స్లోవేనియాకు చెందినవారే) వ్యవహరించనున్నారు.

**అర్జెంటీనాకు ఎందుకు ఆందోళన?**

స్లావ్కో విన్సిచ్ పేరు వినగానే అర్జెంటీనా అభిమానులకు 2022 ఖతార్ ప్రపంచకప్‌లో జరిగిన ఒక ఘోర పరాభవం గుర్తుకొస్తుంది. ఆ టోర్నమెంట్‌లో అర్జెంటీనా ఆడిన తొలి మ్యాచ్ సౌదీ అరేబియాతో జరిగింది. నవంబర్ 22న లుసైల్ స్టేడియంలో జరిగిన ఆ మ్యాచ్‌కు విన్సిచ్ రెఫరీగా ఉన్నాడు. ఆట ప్రారంభమైన 8వ నిమిషంలోనే అర్జెంటీనాకు పెనాల్టీ ఇవ్వగా, మెస్సీ గోల్ చేశాడు. ఆ తర్వాత మ్యాచ్ మొత్తం మీద సౌదీ ఆటగాళ్లకు ఆరు ఎల్లో కార్డులు కూడా చూపించాడు. కానీ, చివరికి ఫలితం తారుమారైంది. సెకండాఫ్‌లో సౌదీ అరేబియా సంచలన ప్రదర్శన చేసి 2-1 తేడాతో అర్జెంటీనాను ఓడించి ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ప్రపంచకప్ చరిత్రలోనే అది ఒక పెద్ద షాక్. మెస్సీ జట్టు విన్సిచ్ రెఫరీయింగ్ లో ఓడిపోయిన ఏకైక మ్యాచ్ కూడా ఇదే కావడం గమనార్హం. ఈ పాత జ్ఞాపకాలే ఇప్పుడు అర్జెంటీనా అభిమానులను కలవరపెడుతున్నాయి.

**స్పెయిన్‌కు మాత్రం సానుకూల చరిత్ర**

అర్జెంటీనాకు విన్సిచ్‌తో చేదు అనుభవం ఉంటే, స్పెయిన్‌కు మాత్రం అతనితో సానుకూల రికార్డు ఉంది. యూరోపియన్ టోర్నీలలో స్పెయిన్ ఆడిన అనేక కీలక మ్యాచ్‌లకు విన్సిచ్ రెఫరీగా వ్యవహరించాడు. 2017లో కొలంబియాతో స్నేహపూర్వక మ్యాచ్, యూరో 2020లో స్వీడన్‌తో గ్రూప్ మ్యాచ్, 2023లో ఇటలీతో నేషన్స్ లీగ్ సెమీ-ఫైనల్ మ్యాచ్‌లకు అతడు బాధ్యతలు నిర్వర్తించాడు. ముఖ్యంగా యువ సంచలనం లామిన్ యమాల్ జట్టులోకి వచ్చాక, యూరో 2024లో ఇటలీ, ఫ్రాన్స్‌లపై స్పెయిన్ గెలిచిన కీలక మ్యాచ్‌లకు విన్సిచ్ రెఫరీగా ఉన్నాడు. ఈ రికార్డు స్పెయిన్ జట్టుకు కొంత ఊరటనిచ్చే అంశం.

**ఈ వరల్డ్‌కప్‌లోనూ వివాదం**

ప్రస్తుత ప్రపంచకప్‌లో కూడా విన్సిచ్ తన కఠిన నిర్ణయాలతో వార్తల్లో నిలిచాడు. మెక్సికో-ఈక్వెడార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈక్వెడార్ ఆటగాడు పీరో హిన్కాపీకి రెడ్ కార్డ్ చూపించాడు. ప్రత్యర్థి ఆటగాడితో మాట్లాడేటప్పుడు నోటికి చేయి అడ్డుపెట్టుకోవడం ఫిఫా నియమావళిని ఉల్లంఘించడమేనని భావించి ఈ నిర్ణయం తీసుకున్నాడు. దీన్ని బట్టి చూస్తే, అతడు నిబంధనల విషయంలో ఎంత కఠినంగా ఉంటాడో అర్థమవుతుంది. అర్జెంటీనా మ్యాచ్‌లలో రెఫరీ నిర్ణయాలు తరచూ వివాదాస్పదం అవుతున్న నేపథ్యంలో, ఈ ఫైనల్‌లో స్లావ్కో విన్సిచ్ ప్రతి నిర్ణయంపై ప్రపంచం దృష్టి నిలుస్తుంది. అతనిపై తీవ్ర ఒత్తిడి ఉండటం ఖాయం.

# భారత్‌కు రోహిత్-కోహ్లీ.. ఇంగ్లాండ్‌కు జో రూట్: కుంబ్లే

- రూట్‌ను విరాట్, రోహిత్‌తో పోల్చిన కుంబ్లే
- ఈ ముగ్గురూ ఒత్తిడిలో ఇన్నింగ్స్ నిర్మిస్తారని ప్రశంస
- రూట్ వన్డే శైలిపై ప్రత్యేక వ్యాఖ్యలు
- ముగ్గురూ బంతిని చూసి స్పందిస్తారని వివరణ
- తక్కువ రిస్క్‌తో ఎక్కువ పరుగులు ఇచ్చే షాట్లని ఎంచుకుంటారని ప్రశంస



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియాకు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఎంత కీలక ఆటగాళ్లో ఇంగ్లండ్‌కు జో రూట్ అంతే కీలకమని మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే అన్నాడు. ఒత్తిడిలో ఇన్నింగ్స్‌ను నిలబెట్టే సామర్థ్యం ఈ ముగ్గురిలోనూ ఒకేలా ఉంటుందని చెప్పాడు. కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో రూట్ ఆడిన 99 పరుగుల ఇన్నింగ్స్‌పై స్పందిస్తూ కుంబ్లే ఈ వ్యాఖ్యలు చేశాడు.

234 పరుగుల లక్ష్య ఛేదనలో రూట్ 133 బంతుల్లో 99 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇన్నింగ్స్‌ను చివరి వరకు నడిపించి ఇంగ్లండ్‌కు నాలుగు వికెట్ల విజయాన్ని అందించాడు. అయితే గస్ అట్కిన్సన్ బౌండరీ కొట్టడంతో రూట్ ఒక్క పరుగు తేడాతో సెంచరీ మిస్ చేసుకున్నాడు.

రూట్ ఇప్పటికీ సంప్రదాయ వన్డే శైలిలోనే బ్యాటింగ్ చేస్తాడని కుంబ్లే పేర్కొన్నాడు. మిగతా ఇంగ్లండ్ బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడగా, రూట్ మాత్రం ఓపికగా ఇన్నింగ్స్‌ను నిర్మించాడని చెప్పాడు. స్ట్రైక్‌ను మారుస్తూ, గ్యాప్‌లలోకి బంతిని పంపిస్తూ ఒత్తిడిని తగ్గించడంలో అతను సిద్ధహస్తుడని కొనియాడాడు. అవసరం లేని సమయంలో రిస్క్ షాట్లు ఆడకపోవడమే అతని బలం అని వివరించాడు. ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్‌తో పోలిస్తే రూట్ ప్రత్యేకత స్పష్టంగా కనిపించిందని కుంబ్లే అభిప్రాయపడ్డాడు. పరిస్థితులు సహకరించని పిచ్‌పై కూడా బ్రూక్ టీ20 తరహా షాట్లు ఆడేందుకు ప్రయత్నించాడని, రూట్ మాత్రం వన్డే బ్యాటింగ్‌కు ఆదర్శంగా నిలిచే ఇన్నింగ్స్ ఆడాడని పేర్కొన్నాడు. రూట్, విరాట్, రోహిత్ విజయాల వెనుక ఉన్న అసలు రహస్యం కూడా ఇదేనని కుంబ్లే చెప్పాడు. ఈ ముగ్గురు ముందే షాట్ నిర్ణయించుకోరని, బంతిని చూసి స్పందిస్తారని వివరించాడు. తక్కువ రిస్క్‌తో ఎక్కువ పరుగులు ఇచ్చే షాట్లనే ఎంచుకుంటారని తెలిపాడు. అలాంటి ఆటతీరు జట్టుకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని కుంబ్లే అభిప్రాయపడ్డాడు.

# డోపింగ్ వివాదంలో పాక్ క్రికెటర్ మొహమ్మద్ నవాజ్‌కు భారీ ఊరట.. కానీ ఆ రికార్డులు రద్దు!

**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మొహమ్మద్ నవాజ్‌కు డోపింగ్ వివాదంలో భారీ ఊరట లభించింది. ఐసీసీ యాంటీ-డోపింగ్ నిబంధనలను ఉల్లంఘించినందుకు అతనిపై విధించిన మూడు నెలల నిషేధం ముగిసింది. ప్రత్యేక చికిత్సా కార్యక్రమాన్ని పూర్తి చేయడం ద్వారా అతని శిక్షను ఒక నెలకు తగ్గించడంతో నవాజ్ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టేందుకు మార్గం సుగమమైంది.

**ఏమిటీ వివాదం?**

ఈ ఏడాది ఫిబ్రవరి 7న శ్రీలంకలోని కొలంబోలో నెదర్లాండ్స్‌తో జరిగిన టీ20 ప్రపంచ కప్ 2026 ప్రారంభ మ్యాచ్ అనంతరం నవాజ్‌కు యాంటీ-డోపింగ్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో అతను 'కార్బాక్సీ-టీహెచ్‌సీ' (ఝుతీఎశీఞ-ఎ-ుఎజ) అనే నిషేధిత ఉత్ప్రేరకాన్ని వాడినట్టు పాజిటివ్‌గా తేలింది. కార్బాక్సీ-టీహెచ్‌సీ అనేది గంజాయిలో ఉండే ప్రాథమిక సైకోయాక్టివ్ రసాయనమైన టీహెచ్‌సీ ఉత్పత్తి. మానవ శరీరం గంజాయిని ప్రాసెస్ చేసినప్పుడు, కాలేయం ఈ సమ్మేళనాన్ని నిర్దిష్ట పదార్థంగా మారుస్తుంది. ఇది శరీరంలో ఎక్కువ కాలం నిల్వ ఉండటం వల్ల, సాధారణ మూత్ర పరీక్షల్లో దీనిని ప్రధాన లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్‌ను గుర్తిస్తారు.

**శిక్ష తగ్గడానికి కారణం**

తాను నిబంధనలను ఉల్లంఘించినట్లు 32 ఏళ్ల నవాజ్ అంగీకరించాడు. అయితే, ఈ పదార్థాన్ని తాను పోటీలకు వెలుపల ఉపయోగించానని, క్రీడా ప్రదర్శనను మెరుగుపరుచుకోవడానికి దీనికి ఎలాంటి సంబంధం లేదని ఐసీసీ ముందు నిరూపించుకోగలిగాడు. దీంతో ఐసీసీ మొదట మూడు నెలల అనర్హత వేటు వేసినప్పటికీ, అతని వివరణతో సంతృప్తి చెందింది. మే 1 నుంచి అతను స్వచ్ఛందంగా తాత్కాలిక సస్పెన్షన్ ప్రారంభించిన తేదీ నుంచి ఈ శిక్షను వర్తింపజేసింది. అంతేకాకుండా ఆమోదిత మాదకద్రవ్యాల దుర్వినియోగ చికిత్సా కార్యక్రమాన్ని పూర్తి చేస్తే, శిక్షను ఒక నెలకు తగ్గిస్తున్నట్టు ఐసీసీ వెసులుబాటు కల్పించింది.

నేడు ఐసీసీ విడుదల చేసిన ఒక ప్రకటనలో.. "నవాజ్ తనపై విధించిన శిక్షను అంగీకరించి, చికిత్సా కార్యక్రమానికి కట్టుబడి ఉన్నందున, సుమారు రెండున్నర నెలల సస్పెన్షన్ పూర్తి చేసుకున్న తర్వాత అతని తాత్కాలిక నిషేధాన్ని ఎత్తివేయడం జరిగింది. ఐసీసీ సంతృప్తి మేరకు చికిత్సా కార్యక్రమాన్ని పూర్తి చేస్తే, నవాజ్ ఇకపై ఎలాంటి అనర్హత కాలాన్ని ఎదుర్కోవాల్సిన అవసరం లేదు" అని స్పష్టం చేసింది.

# ఓటీటీ మార్కెట్ స్లో అయినా.. చైతూకి ఎందుకింత డిమాండ్?

టాలీవుడ్ లో గత కొంతకాలంగా ఓటీటీ మార్కెట్ జోరు తగ్గిందనే చర్చ సాగుతోంది. ఒకప్పుడు స్టార్ హీరోల సినిమాలకు భారీ మొత్తాలు వెచ్చించిన డిజిటల్ సంస్థలు ఇప్పుడు మాత్రం ఎంపిక చేసిన ప్రాజెక్టులకే పెద్ద మొత్తాలు కేటాయిస్తున్నాయి. అలాంటి పరిస్థితుల్లో అక్కినేని నాగ చైతన్య నటిస్తున్న వృషకర్మ సినిమాకు సంబంధించిన నాన్ థియేట్రికల్ బిజినెస్ వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి.

సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండగానే భారీ డిజిటల్, శాటిలైట్ డీల్ జరిగిందనే ప్రచారం వినిపిస్తోంది. దీంతో ప్రస్తుతం ఓటీటీ మార్కెట్ స్లోగా ఉన్నా చైతూకి ఎందుకింత డిమాండ్ ఏర్పడిందనే చర్చ మొదలైంది. ఇటీవల నాగ చైతన్య కెరీర్ లో కీలక మలుపుగా నిలిచిన చిత్రం తండేల్. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా చైతన్య మార్కెట్ ను కూడా పెంచిందని చెప్పాలి.



సున్నితమైన న్యూట్రల్ రంగుల దుస్తుల్లో క్లాసిక్ హుందాతనాన్ని చాటుతున్న కత్రినా కైఫ్



చాలా కాలంగా ఒక పెద్ద కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూసిన చైతూ, తండేల్ తో ఆ లోటును కవర్ చేశారు. ఆ సక్సెస్ ఎఫెక్ట్ ఇప్పుడు ఆయన కొత్త సినిమా వృషకర్మపై కనిపిస్తోందని టాక్ వినిపిస్తోంది. మరోవైపు వృషకర్మ సాధారణ కమర్షియల్ సినిమా కాదు. మిస్టరీ, అడ్వెంచర్, పురాణ అంశాలు, నిధుల అన్వేషణ వంటి అంశాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం నాగ చైతన్యను కొత్త కోణంలో చూపించబోతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ లో ట్రెజర్ హంటర్ పాత్రలో చైతూ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. గతంలో చేయని రోల్ లో కనిపించబోతుం డటంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. దర్శకుడు కార్తీక్ దండు పేరు కూడా ఆ ప్రాజెక్టుకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. విరూపాక్ష వంటి విజయం తర్వాత ఆయన రూపొందిస్తున్న సినిమా కావడంతో ప్రేక్షకులతో పాటు డిజిటల్ సంస్థల్లోనూ నమ్మకం పెరిగినట్లు తెలుస్తోంది.

ఓటీటీ సంస్థలు ఇప్పుడు కేవలం స్టార్ ఇమేజ్ ను మాత్రమే చూడడం లేదు. థియేటర్ల తర్వాత కూడా ఎక్కువకాలం వీక్షకులను ఆకర్షించే కంటెంట్ కే ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఆ కోణంలో చూస్తే వృషకర్మలో ఉన్న మిస్టరీ, ఫాంటసీ, థ్రిల్లర్ అంశాలు డిజిటల్ ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్నారు. దీంతో చైతన్య సినిమా కోసం ముందుగానే భారీ పెట్టుబడి పెట్టడానికి ఓటీటీ సంస్థలు ఆసక్తి చూపినట్లు సమాచారం.

అలాగే నాగ చైతన్యకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఓటీటీ ద్వారా ఇతర భాషల ప్రేక్షకుల్లోనూ మంచి గుర్తింపు ఉంది. ఇటీవల కాలంలో ఆయన సినిమాలు డిజిటల్ ప్లాట్ ఫామ్స్ లో కూడా మంచి ఆదరణ పొందినట్లు తెలుస్తోంది. ఆ అంశం కూడా వృషకర్మ డీల్ కు కలిసి వచ్చినట్లు చెబుతున్నారు. అలా ప్రస్తుతం ఓటీటీ మార్కెట్ నెమ్మదించినా, ట్రాక్ రికార్డ్, పెరుగుతున్న మార్కెట్, కొత్త తరహా కథలు ఎంపిక చేసుకోవడం, దర్శకుడిపై ఉన్న నమ్మకం వంటి అంశాలు నాగ చైతన్యకు డిమాండ్ తీసుకొచ్చినట్లు కనిపిస్తోంది. అందుకే వృషకర్మ విడుదలకు ముందే ఇండస్ట్రీలో ఇంతటి చర్చకు కారణమవుతోందని ట్రేడ్ పండితులు అభిప్రాయపడుతున్నారు.



స్రవంతి చోకరపు ఒక అందమైన జీవిత సందేశాన్ని పంచుకున్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965